


Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 44 | బుధవారం 9 జూలై 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




## ప్రధాని మోడీకి
## బ్రెజిల్ అత్యున్నత పురస్కారం

**- గ్రాండ్ కాలర్ ఆఫ్ ది నేషనల్ ఆర్డర్ ఆఫ్ ది సదరన్ క్రాస్‌తో సత్కారం**

**బ్రెసిలియా– సూర్య వాస్తవం, జూలై 8:** ప్రధాని మోడీ మరో దేశం నుంచి అత్యున్నత పురస్కారం అందుకున్నారు. బ్రెజిల్‌లోని బ్రెసిలియాలో మంగళవారం జరిగిన ఒక వేడుకలో బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డిసిల్వా చేతుల మీదుగా బ్రెజిల్ అత్యున్నత పౌర పురస్కారం స్వీకరించారు. గ్రాండ్ కాలర్ ఆఫ్ ది నేషనల్ ఆర్డర్ ఆఫ్ ది సదరన్ క్రాస్‌ను ప్రధాని మోడీకి ప్రదానం చేశారు.



# 15న జీడీపల్లికి నీళ్లు

- 11న హంద్రీనీవా పంపులు ప్రారంభిస్తాం
- శ్రీశైలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- జలాశయం గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- జిల్లాలోనే 'ఉచిత బస్సు'?

**కర్నూలు – సూర్య వాస్తవం, జూలై 8:**



హంద్రీనీవా పంపులను ఈ నెల 11న ప్రారంభిస్తామని, 15వ తేదీకి జీడిపల్లికి నీళ్లు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. మంగళవారం ఆయన శ్రీశైలంలో పర్యటించారు. ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్‌లో సున్నిపెంటలోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి శ్రీశైలం దేవస్థానానికి వెళ్లి శ్రీశైల భ్రమరాంబిక, మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీశైలం జలాశయం వద్దకు చేరుకొని కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. నాలుగు గేట్లను పది అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు అనంతరం సున్నిపెంటలో నిర్వహించిన ప్రజావేదిక సభలో మాట్లాడుతూ జులైలోనే శ్రీశైలం నిండుగా ఉండడం శుభపరిణామన్నారు. రాష్ట్రంలోని అన్ని జలాశయాలూ నిండాలని, సాగు, తాగునీరు, పరిశ్రమలకు నీరు పుష్కలంగా ఇచ్చే అవకాశం ఉండాలని ఆకాంక్షించారు. గత టిడిపి ప్రభుత్వంలో రూ.68 వేల కోట్లు ప్రాజెక్టులకు ఖర్చు పెట్టామని, ఇందులో రూ.12 వేల కోట్లు ఖర్చు రాయలసీమకే ఖర్చు చేశామని తెలిపారు. వైసిపి ప్రభుత్వం గత ఐదేళ్లలో రాయలసీమ ప్రాజెక్టులకు రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టిందన్నారు. రూ.3,890 కోట్లతో హంద్రీనీవా కాలువల విస్తరణ కాలువ లైనింగ్ పనులు తాము చేపట్టామని తెలిపారు. ఈ నెల 30 నాటికి కుప్పానికి నీళ్లు తీసుకెళ్లేందుకు శ్రీకారం చుటామనారు. పోలవరం నుంచి బనకచర్లకు

- మిగతా 2లో..



## ఘనంగా వైఎస్‌ఆర్ జయంతి

**- తల్లితో కలిసి ఘాట్ వద్ద వేర్వేరుగా నివాళులర్పించిన జగన్, షర్మిల**

**వేంపల్లె – సూర్య వాస్తవం, జూలై 8:**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతి వేడుకలు మంగళవారం వైఎస్‌ఆర్ కడప జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. వేంపల్లె మండలం ఇడుపులపాయలోని వైఎస్‌ఆర్ సమాధి వద్ద తల్లి విజయమ్మ, భార్య వైఎస్.భారతి, ఇతర కటుంబ సభ్యులతో కలిసి మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల వేర్వేరుగా నివాళులర్పించారు. అక్కడే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముందుగా వైఎస్‌ఆర్ ఘాట్ వద్దకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సతీమణి విజయమ్మ చేరుకున్నారు. జగన్ రాక ముందే తన భర్త సమాధి వద్ద ఆమె నివాళులర్పించారు. అనంతరం భారతి రాగానే గతంలో మాదిరి జగన్ కోసం వేచి ఉండకుండా చర్చి ఫాస్టర్ ప్రార్థనలు ప్రారంభించారు. ప్రార్థనలు జరుగుతుండగా ఉదయం 7.50 గంటలకు వైఎస్‌ఆర్ ఘాట్ వద్దకు కడప ఎంపి అవినాష్‌రెడ్డితో కలిసి జగన్ విచ్చేశారు.

- మిగతా 2లో..

## ఏపీ రియాలిటీ రంగంలో
# పెట్టుబడులు పెట్టండి...

- ప్రెస్టీజ్ గ్రూప్‌కు మంత్రి నారా లోకేశ్ ఆహ్వానం
- బెంగళూరులో ప్రెస్టీజ్ గ్రూప్ చైర్మన్‌తో మంత్రి నారా లోకేశ్ భేటీ
- అమరావతి, విశాఖ, రాయలసీమలో అభివృద్ధిని వివరించిన లోకేశ్
- 'ప్లగ్ అండ్ ప్లే' మోడల్‌కు సహకరించాలని విజ్ఞప్తి
- పెట్టుబడుల అంశాన్ని పరిశీలిస్తామన్న ప్రెస్టీజ్ గ్రూప్
- ఏడాదిలోనే రూ.9.5 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్న మంత్రి



**బెంగళూరు– సూర్య వాస్తవం, జూలై 8:**

ఆంధ్రప్రదేశ్‌లో రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రముఖ నిర్మాణ రంగ సంస్థ ప్రెస్టీజ్ గ్రూప్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు బెంగళూరులో ప్రెస్టీజ్ గ్రూప్ ఛైర్మన్ ఇర్ఫాన్ రజాక్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాయాద్ నౌమాన్‌లతో లోకేశ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రస్తుతం పూర్తి అనుకూల వాతావరణం ఉందని ఈ సందర్భంగా ఆయన వారికి

- మిగతా 2లో..



## వ్యక్తిగత
## దూషణలు తగవు..

- ప్రసన్నకుమార్‌రెడ్డిపై పవన్ ఆగ్రహం
- కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై వైసీపీ నేత ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలు
- తీవ్రంగా ఖండించిన డిప్యూటీ సీఎం
- మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యాఖ్య
- వైసీపీ నేతలకు మహిళలను కించపరచడం అలవాటైపోయిందని విమర్శ
- ఇలాంటి వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పవన్ పిలుపు

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## ప్రసన్నకుమార్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయండి

- మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమారు రెడ్డి అలా మాట్లాడడం దుర్మార్గం
- తల్లి, చెల్లిని గౌరవించని నాయకుడు - ఒక నాయకుడా..?
- హోంమంత్రి అనిత

**విజయనగరం – సూర్య వాస్తవం**

టీడీపీ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారమే రేపాయి..ఈ వ్యాఖ్యలపై స్పందించిన హోంమంత్రి అనిత.. ప్రసన్నకుమార్ రెడ్డిని వెంటనే వైసీపీ నుంచి సస్పెండ్ చేయండి అంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు సలహా ఇచ్చారు. విజయనగరం జిల్లా బొబ్బిలి నియోజకవర్గంలో ఇంఛార్జ్ మంత్రి వంగలపూడి అనిత పర్యటించారు.. బొబ్బిలి పట్టణంలో



- మిగతా 2లో..

## పెరగని ప్రయివేటు ఉద్యోగుల వేతనాలు

- వచ్చే ఆదాయంలోనే ఈఎంఐలు, అప్పులు, వడ్డీలు
- కుటుంబమంతా కష్టపడినా అరకొర జీతాలే
- మానసికంగా, శారీరకంగా ఒత్తిళ్లు భారమవుతున్న మధ్యతరగతి బతుకులు
- భారత్‌లో ఆందోళనకరంగా మధ్యతరగతి ఉద్యోగుల పరిస్థితులు

2లో

# ఏపీ రియాలిటీ రంగంలో పెట్టుబడులు పెట్టండి...

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని లోకేశ్ వారికి వివరిస్తూ, "సుమారు రూ.65 వేల కోట్ల వ్యయంతో అమరావతి రాజధాని పనులు వేగంగా సాగుతున్నాయి. గూగుల్, టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థల రాకతో విశాఖపట్నం ఐటీ హబ్‌గా రూపాంతరం చెందుతోంది. మరోవైపు రాయలసీమలో రిలయన్స్, రెన్యూ వంటి సంస్థలు గ్రీన్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి" అని తెలిపారు. గడిచిన ఏడాది కాలంలోనే వివిధ సంస్థలు రాష్ట్రంలో రూ.9.5 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాయని ఆయన గుర్తుచేశారు. ఏపీలో 'ప్లగ్ అండ్ ప్లే' పద్ధతిలో మౌలిక వసతుల కల్పనకు సహకరించాలని లోకేశ్ కోరారు. మంత్రి విజ్ఞప్తిపై ప్రెస్టీజ్ గ్రూప్ ఛైర్మన్ ఇర్ఫాన్ రజాక్ సానుకూలంగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టే అవకాశాలను తప్పకుండా పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కాగా, దేశంలోని 13 ప్రధాన నగరాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న ప్రెస్టీజ్ గ్రూప్ ఇప్పటివరకు 350కి పైగా ప్రాజెక్టులను పూర్తి చేసింది. రియల్ ఎస్టేట్ రంగంలో క్రిసిల్ డీఏ1ం రేటింగ్ పొందిన ఏకైక భారతీయ సంస్థ ఇదే కావడం గమనార్హం.

# ఘనంగా వైఎస్ఆర్ జయంతి

(మొదటిపేజీ తరువాయి)

అరగంట పాటు ప్రార్థనల తర్వాత వైఎస్ఆర్ ఘాట్‌కు తల్లి విజయమ్మ, సతీమణి భారతిలతో కలిసి పూలమాలతో నివాళులర్పించారు. ఆ తర్వాత సమీపంలోని వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పించి అక్కడే ఉన్న వైసిపి నేతలు, నాయకులు, కార్యకర్తలతో సెల్ఫీ తీసుకొని వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తల్లి విజయమ్మను ప్రేమతో ఆలింగనం చేసుకొని ఆమె దీవెనలను తీసుకున్నారు. అనంతరం ఇడుపులపాయలోని గెస్ట్‌హౌస్‌కు వెళ్లి అక్కడ నుండి పులివెందులకు బయలుదేరి వెళ్లారు.

వైఎస్ఆర్ ఘాట్ వద్ద నుండి జగన్ వెళ్లిపోయిన కొద్ది నిమిషాల్లోనే అక్కడికి తన తల్లి విజయమ్మ, పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డితో కలిసి వైఎస్.షర్మిల వచ్చారు. తల్లి విజయమ్మతో కలిసి ప్రార్థనల తర్వాత వైఎస్ఆర్ ఘాట్‌కు నివాళులర్పించారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. అక్కడికి వచ్చిన నాయకులను పేరుపేరునా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకొని వారితో సెల్ఫీలు దిగారు. అనంతరం అక్కడి నుండి గెస్ట్‌హౌస్‌కు వెళ్లారు.

**జగన్‌ను కలిసిన ఆర్కిటెక్చర్ విద్యార్థులు**

జగన్‌ను ఆర్కిటెక్చర్ విద్యార్థులు కలిసి తమ సమస్యలను వివరించారు. వారి సమస్యలపై పోరాడుతానని ఈ సందర్భంగా విద్యార్థులకు జగన్ హామీ ఇచ్చారు. ఆయన వెంట వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, రాజంపేట, బద్వేలు ఎమ్మెల్యేలు అమర్నాథ్‌రెడ్డి, సుధా, కడప మేయర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యేలు అంజాద్‌బాష, గండికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, రవీంద్రనాథ్‌రెడ్డి, రఘురామిరెడ్డి ఉన్నారు.

# వ్యక్తిగత దూషణలు తగవు..

- ప్రసన్నకుమార్‌రెడ్డిపై పవన్ ఆగ్రహం
- కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై వైసీపీ నేత ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలు
- తీవ్రంగా ఖండించిన డిప్యూటీ సీఎం
- మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యాఖ్య
- వైసీపీ నేతలకు మహిళలను కించపరచడం అలవాటైపోయిందని విమర్శ
- ఇలాంటి వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పవన్ పిలుపు

**అమరావతి- సూర్య వాస్తవం, జూలై 8:** నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైసీపీ నేత నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడటం దారుణ మని, ఇలాంటి చర్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ విషయంపై పవన్ కల్యాణ్ ఒక ప్రకటన విడుదల చేశారు. "మహిళలపై అసభ్యకరంగా, అవమానకరంగా మాట్లాడటం వైసీపీ నేతలకు ఒక అలవాటుగా మారిపోయింది. ప్రశాంతిరెడ్డి వ్యక్తిగత జీవి తాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత అభ్యంతర కరమైనవి" అని ఆయన పేర్కొన్నారు. మహిళల గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని జనసేనాని స్పష్టం చేశారు. గతంలో శాసనసభలోనూ వైసీపీ నేతలు ఇలాగే ప్రవర్తించా రని, అందుకే ప్రజలు ఎన్నికల్లో వారికి సరైన బుద్ధి చెప్పారని పవన్ గుర్తుచేశారు. మహిళలను కించపరిచే ఇలాంటి చర్యలను ప్రజాస్వామ్యవాదులు అందరూ ముక్తకంఠంతో ఖండించాలని పిలుపు నిచ్చారు. ఇలాంటి రాజకీయాలను రాష్ట్రంలోని మహిళా సమాజం మరోసారి తిప్పికొడుతుందని ఆయన వ్యాఖ్యానించారు.

# ప్రసన్నకుమార్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయండి

- మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమారు రెడ్డి అలా మాట్లాడడం దుర్మార్గం
- తల్లి, చెల్లిని గౌరవించని నాయకుడు - ఒక నాయకుడా..?
- హోంమంత్రి అనిత

విజయనగరం - సూర్య వాస్తవం

టీడీపీ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారమే రేపాయి..ఈ వ్యాఖ్యలపై స్పందించిన హోంమంత్రి అనిత.. ప్రసన్నకుమార్ రెడ్డిని వెంటనే వైసీపీ నుంచి సస్పెండ్ చేయండి అంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు సలహా ఇచ్చారు. విజయనగరం జిల్లా బొబ్బిలి నియోజకవర్గంలో ఇంఛార్జ్ మంత్రి వంగలపూడి అనిత పర్యటించారు.. బొబ్బిలి పట్టణంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. ఇంటింటికి వెళ్ళి ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు.. బొబ్బిలి రావువారి వీధిలో తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు..భారతదేశం అంటే స్త్రీలను గౌరవించే దేశం.. ప్రపంచదేశాలలు భారతదేశాన్ని చూసి స్త్రీలను గౌరవిరస్తారు.. కానీ, వైసీపీ పార్టీ కోసం మాట్లాడడం మేం కూడా సిగ్గుపడుతున్నాం.. వైసీపీ నేతలు మహిళలను అగౌరవపరుస్తున్నారంటూ ఫైర్ అయ్యారు హోంమంత్రి అనిత.. తల్లి, చెల్లిన గౌరవించని నాయకుడు-ఒక నాయకుడా..? ఎమ్మెల్యేలకు అధ్యక్ష అనాలనే కోరిక ఉంటుంది.. అందులో మహిళా ఎమ్మెల్యేను మరింత గౌరవించాలి అని సూచించారు.. మహిళా ఎమ్మెల్యేపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమారు రెడ్డి అలా మాట్లాడడం దుర్మార్గం అన్నారు.. ప్రసన్నకుమారు మాట్లాడిన విడియో మీ తల్లికి, మీ భార్యకు, మీ బిడ్డ దగ్గరకు వెళ్లి చూపించండి.. ప్రసన్నకుమారు రెడ్డి గతంలో తనపై కూడా ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 15న జీడీపల్లికి నీళ్లు



(మొదటిపేజీ తరువాయి)

నీళ్లు వస్తే కరువు ఉండదని తెలిపారు. గోదావరి నుంచి రెండు వేల టిఎంసిల నీరు సముద్రంలోకి వృథాపోతోందన్నారు. ఇందులో 200 టిఎంసిలు మన రాష్ట్రం, 100 నుంచి 200 టిఎంసిలు తెలంగాణ వాడుకోగలిగితే రెండు రాష్ట్రాలకూ ఉపయోగం ఉంటుందని తెలిపారు.

**సాగునీటి సంఘాలకు పూర్తి అధికారాలు, నిధులు**

సాగునీటి సంఘాలకు పూర్తి అధికారాలు, నిధులు ఇస్తామని చంద్రబాబు తెలిపారు. ఆయకట్టు రైతులకే పెత్తనం ఇవ్వాలని సాగునీటి సంఘాలను ఏర్పాటు చేశామని, వాటి ద్వారా భూగర్భ జలాలు పెంచే బాధ్యత తీసుకుంటామని అన్నారు. ప్రపంచమంతా తృణధాన్యాల వైపు వెళ్తోందని, పండ్లకు కూడా డిమాండ్ ఏర్పడే పరిస్థితి వచ్చిందని తెలిపారు. పండ్లు పండించేందుకు రాయలసీమ ప్రాంతం అనుకూలమైనదన్నారు. రాయలసీమలో స్టీల్‌ప్లాంట్ వస్తుందని, కొప్పర్తి ఓర్వకల్ ఇండిస్టియల్ పార్క్, లేపాక్షి ఇండిస్టియల్ హబ్, గ్రీన్ ఎనర్జీ, టూరిజం, సోలార్, విండ్, హైడల్ ఎనర్జీ ప్రాజెక్టులు వస్తాయని వివరించారు. సూళ్లూరుపేటలో ఏరోసిటీ వచ్చి ప్రైవేటు పెట్టుబడులు సమకూరు తాయన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ఆదాయం పెంచుతున్నామని తెలిపారు. మహిళలు జిల్లాలో ఎక్కడ తిరగాలన్నా ఆగస్టు 15 నుండి ఫ్రీ బస్ పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీశైలం డ్యామ్ ఎగ్జిబిషన్‌ను సిఎం చంద్రబాబుకు ఇరిగేషన్ అధికారి వివరించారు. అనంతరం హెలికాప్టర్ ద్వారా శ్రీశైలం జలాశయాన్ని, నదీ పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, బిసి జనార్ధన్ రెడ్డి, ఎన్ఎండి ఫరూఖ్, ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, భూమా అఖిలప్రియ, జయసూర్య, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జలవనరుల శాఖ సిఇ ఎస్.కబీర్ బాష, ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల ప్రతినిధులు, రైతులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**జిల్లాలోనే 'ఉచిత బస్సు' ?**

మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పరిధికే పరిమితం చేయనుందా? సున్నిపెంటలో జరిగిన ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగం అనంతరం ఈ అంశంపై చర్చ జరుగుతోంది. ఆయన తన ప్రసంగంలో 'మహిళలు జిల్లాలో ఎక్కడ తిరగాలన్నా ఆగస్టు 15 వ తేది నుండి ఉచిత బస్సు పథకం అమలు చేస్తాం' అని చెప్పారు. దీంతో ఉచిత బస్సు పథకాన్ని జిల్లా పరిధికే పరిమితం చేసే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. అయితే, అధికారులు మాత్రం సిఎం ప్రకటనపై పెదవి విప్పడం లేదు.

# పెరగని ప్రయివేటు ఉద్యోగుల వేతనాలు

- వచ్చే ఆదాయంలోనే ఈఎంఐలు, అప్పులు, వడ్డీలు
- కుటుంబమంతా కష్టపడినా అరకొర జీతాలే
- మానసికంగా, శారీరకంగా ఒత్తిళ్లు భారమవుతున్న మధ్యతరగతి బతుకులు
- భారత్‌లో ఆందోళనకరంగా మధ్యతరగతి ఉద్యోగుల పరిస్థితులు

అమరావతి - సూర్య వాస్తవం

పేరుకే ఉద్యోగాలున్నా.. వస్తున్న జీతాలు అతి తక్కువ. ఏండ్ల తరబడి పనిచేస్తున్నా వేతనాల్లో ఎలాంటి పెరుగుదల ఉండట్లేదు. కానీ ఏటా ఖర్చులు మాత్రం పెరుగుతున్నాయి. ఇంటి అద్దెలు మొదలు ప్రతినెలా ఈఎంఐలు, స్కూల్, కాలేజీ ఫీజులు, రోజువారీ ఖర్చులు అన్నీ పెరిగేవే. వచ్చే జీతం చాలక అప్పు చేస్తే, దానికి చెల్లించే వడ్డీలు మరింత అదనం. జీవితాన్ని గాడిన పెట్టుకోవడం కోసం మధ్యతరగతి జీవి సర్కస్ ఫీట్లే చేయాల్సి వస్తోంది. పట్టు తప్పితే ప్రాణాల మీదకూ వస్తున్నది. ఏరోజుకారోజు ప్రయివేటు ఉద్యోగులు మానసిక, శారీరక ఆందోళనలతో తీవ్రమైన ఒత్తిళ్లకు గురవుతున్నారు.

దేశంలో మధ్యతరగతి ప్రయివేటు ఉద్యోగుల జీతాలు పెరగట్లేదు. ఖర్చులు మాత్రం పెరుగుతున్నాయి. వస్తున్న జీతం చాలక ఆర్థికంగా నానా అవస్థలు పడుతున్నారు. ఆదాయ, వ్యయాల్ని సమన్వ యం చేసుకోలేక సతమతమవుతున్నారు. అదనపు ఆదాయాల కోసం ఇతర మార్గాల్ని అన్వేషించాల్సి వస్తుంది. కుటుంబంలో భార్యాభర్తలు కలిసి పనిచేస్తున్నా, మారుతున్న జీవన ప్రమాణాలు, ఆర్థిక స్థితిగతులకు అనుగుణంగా జీవితాలు ఉండట్లేదు.

కుటుంబంలోని ఇద్దరు పిల్లల్ని స్థోమతకు తగినట్టు పెంచలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇటీవల ఓ ఆంగ్ల పత్రిక కథనాన్ని ప్రచురించింది. అనేక ఆసక్తికర అంశాలను దానిలో పేర్కొంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రా ల్లోనూ దాదాపు ఇవే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. నోయిడాలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగిని తన వేతనం గురించి మాట్లాడుతూ 'వస్తున్న జీతం చాలక, పెరిగిన ఖర్చులు భరించలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నాను' అని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఢిల్లీలో ఓ పబ్లిక్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంటి కిరాయి పెంచొద్దంటూ తన ఇంటి ఆ యజమానిని ప్రాధేయపడ్డాననీ, తన జీతంలో ఇప్పటికే సగభాగం కిరాయికే వెళ్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు పెంచుతారన్న హామీ నేపథ్యంలో చెన్నై, అహ్మదాబాద్ నగరాల్లో కొలువులకు వచ్చిన ఓ టెకీ, మరో యువ ప్రొఫెషనల్ 'ఇక్కడికి ఎందుకొచ్చామా అని తలలు పట్టుకుంటున్నాం' అనే అభిప్రాయం వ్యక్తం చేశారు. పూణే వంటి నగరాల్లో అద్దె ఇండ్ల యజమానుల్ని పోషించేందుకే ఉద్యోగాలు చేస్తున్నామేమో అని సందేహం కలుగుతుందని అక్కడి ఐటీ ఇంజినీర్ ఒకరు చెప్పుకొచ్చారు. పేరుకే వైట్ కాలర్ ఉద్యోగాలు. జీతాలు మాత్రం గొర్రెతోకే అంటూ పలువురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. పెరగని జీతాలతో మధ్యతరగతి కుటుంబాల్లో ఆర్థిక స్థిరత్వం దిగజారిపోతున్నది.



**పెరిగిన పని గంటలు**

ఉద్యోగులు, సిబ్బందితో పుట్టెడు చాకిరీ చేయించుకునే సంస్థలు క్రమంగా పనిగంటల్ని పెంచేస్తున్నాయి. గతంలో 'వర్క్ ఫ్రం హోం' అంటే సంబరపడిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇప్పుడు ఆఫీసులకు వెళ్లి పనిచేయడాన్నే ఇష్టపడుతున్నారు. "ఆఫీస్‌కు వెళ్తే నిర్ణీత పనిగంటలు ఉంటాయి. వర్క్ ఫ్రం హోంలో దాదాపు 14 నుంచి 16 గంటలు పనిచేయాల్సి వస్తుందని హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉద్యోగి ఆందోళన వ్యక్తం చేశారు. అంత పని చేసినా, జీతాలు ఎప్పుడొస్తాయో చెప్పలేని స్థితి ఉందని చెప్పుకొచ్చారు. 'ఇచ్చే జీతం టైంకి వస్తే చాలనుకుంటున్నాం. జీతం పెంపును ఆశించడం అత్యాశ అనే అనిపిస్తుంది' అని మరో ప్రయివేటు సంస్థ ఉద్యోగి అభిప్రాయం వ్యక్తం చేశారు. మరికొన్ని సంస్థలైతే జీతాల పెంపు అనే డిమాండ్‌ను నిషిద్ధ పదంగా భావిస్తున్నాయి. "నాకు జీతం చివరిగా ఏడాదిన్నర క్రితం పెరిగింది. ఈ ఏడాది జీతం పెరుగుదలను ఆశించే పరిస్థితులు కని పించట్లేదు. పనిఒత్తిడి పెరిగింది. గతంలో కచ్చితమైన తేదీతో వచ్చే జీతాలు, ఇప్పుడు ఎప్పుడు వస్తాయో చెప్పలేక పోతున్నాం. ఉద్యోగం మానేసే పరిస్థితీ లేదు. మరో కంపె నీ కి వెళ్లినా అక్కడా ఇదే పరిస్థితి' అంటూ ఫైనాన్షి యల్ డిస్ట్రిక్ట్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగిని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్థిక ఒత్తిళ్లతో గర్భాశయ నొప్పి, హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యలతో బాధపడుతున్నానని నోయిడాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్న క్రితికా శర్మ (30) చెప్పుకొచ్చారు. ఢిల్లీలో కమ్యూనికేషన్స్‌లో పని చేసే సుస్మితా పక్రసి(34) మెరుగైన జీతం కోసం జర్నలిజాన్ని వదిలిపెట్టారు. " పే స్లిప్ మీదే నేను ఎక్కువ సంపాదిస్తున్నా ను. అద్దె, కిరాణా సామాగ్రి, ఈఎంఐలు, ఆరోగ్య సంరక్షణ వంటి ఖర్చులతో పోలిస్తే, ఐదేండ్ల క్రితం నా ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో ఇప్పుడు దానికంటే తిరోగమనంలో ఉన్నాను" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**లాభాల్లో సంస్థలు**

ఉద్యోగులకు తక్కువ వేతనాలు ఇస్తున్న భారతీయ కంపెనీలు లాభాలు భారీగా గడిస్తున్నాయి. కంపెనీలోకల టాప్ పొజీషన్‌లో ఉండే వారికే పెద్ద ఎత్తున జీతాలు, ప్యాకేజీలు అందుతున్నాయి. కిందిస్థాయి ఉద్యోగులకు మాత్రం తక్కువ వేతనాలే. అయాన్ అనే సంస్థ 1400 కంపెనీలపై ఒక సర్వే నిర్వహించింది. ఆయా కంపెనీల్లో ఉద్యోగుల స్థితిగతులు, పెరిగిన సంస్థల లాభాలను అధ్యయనం చేసింది. దానిలో ఇలాంటి అనేక విస్తుపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి.

**నిజ వేతనాల్లో 130వ స్థానం**

అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) నివేదిక ప్రకారం భారతదేశంలో నిజమైన వేతన వృద్ధి 130వ స్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఆయా దేశాల్లోని ప్రయివేటు ఉద్యోగుల వేతనాలను పరిశీలించిన తర్వాత ఐఎల్ఓ ఈ నివేదికను వెల్లడించింది. జీతాల పెంపుదల విషయంలో 47 శాతం మంది అసంతృప్తితో ఉన్నారనీ, 25 శాతం మంది తటస్థంగా ఉంటే, 59 శాతం మంది జీతాల్లో తక్కువ పెరు గుదలను చూశామని చెప్పారు. ఎంట్రీ లెవల్ (0-3 ఏండ్ల అనుభవం) ఉద్యోగులు 31 శాతం మంది తాము తక్కువ వేతనాలు పొందుతున్నామని చెప్పారు.

మధ్య స్థాయి (7-10 ఏండ్ల అనుభవం) ఉద్యోగుల్లో 18 శాతం మంది అసంతృప్తి వెలిబుచ్చారు. జీతాల పెంపు లేనందున కనీసం కేంద్ర ప్రభుత్వం విధించే ఆదాయపు పన్నుల్లో మినహాయి ంపులు ఇచ్చినా, తమకు ఎంతో కొంత ఆర్థిక స్థిరత్వానికి దోహదపడుతుందని పలువురు ఉద్యోగులు చెప్తున్నారు. పెరిగిన ఖర్చులతో పోల్చినప్పుడు పన్ను మినహాయింపు రూ.7 లక్షలను మించి ఉండాలని మిన్‌ఈఎంఐ సహవ్యవ స్థాపకులు, ఆర్థిక సలహాదారు సిద్ధార్థ్ జైన్ అన్నారు.

**మోడీ ప్రచారం ఉత్తిదే**

భారత్ ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందనీ, జీడీపీలో మెరుగైన వృద్ధిని సాధిస్తున్నామని మోడీ సర్కారు చేసుకుంటున్న ప్రచారంలోని డొల్లతనం ఆయా ఉద్యోగుల మాటల్లో వ్యక్తమవుతుంది. ప్రజలకు పొదుపు చేసే శక్తి సన్నగిల్లుతోంది. ఆ స్థానాన్ని పర్సనల్ లోన్‌లు, క్రెడిట్‌కార్డులు ఆక్రమించి, మధ్యతరగతి ఉద్యోగి భవిష్యత్‌ను ముందుస్తుగానే అప్పుల ఊబిలోకి లాగేస్తున్నాయి. 2024లో గృహ పొదుపు జీడీపీలో 18.1 శాతానికి పడిపోయింది. స్థూల దేశీయ పొదుపులు జీడీపీలో 30.7 శాతానికి తగ్గాయి.

# డాగ్ కెనాల్స్ నిర్మాణానికి భూమి పూజ

విజయవాడ - సూర్య వాస్తవం

ఎన్.టి.ఆర్.పోలీస్ కమీషనరేట్‌లో అదనంగా మరో రెండు డాగ్ కెనాల్స్ (రూమ్‌లను) నిర్మాణానికి నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు భూమి పూజ నిర్వహించారు. ఎన్.టి.ఆర్.జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలో ప్రముఖులు, వి.వి.ఐ.పి.లు, ముఖ్య వ్యక్తులు విచ్చేసే సమయంలో వారి భద్రత విషయంలో, వివిధ బందోబస్తులలో, నార్కోటిక్స్, నేర పరిశోధనలలో, ప్రముఖుల పర్యటనలలో ఎటువంటి సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా జరిగేందుకు ముందస్తు చర్యలలో భాగంగా ఎక్స్‌ప్లోజివ్స్‌ను గుర్తించేందుకు తనిఖీలను నిర్వహించేందుకు శిక్షణ ఇచ్చిన డాగ్‌లను ఉపయోగించడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో సిటీ ఆర్మడ్ రిజర్వ్ గ్రౌండ్ సమీపంలోని డాగ్స్ కెనాల్ వద్ద ఆగస్టు నెలలో శిక్షణ పూర్తి చేసుకుని వస్తున్న రెండు డాగ్‌ల కోసం అదనంగా మరో రెండు డాగ్ కెనాల్స్‌లను నిర్మించడానికి మంగళవారం నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబుతో పాటు, అడ్మిన్ డి.సి.పి. కె.జి.వి.సరిత డి.సి.పి. ఏ.బి.టి.ఎస్. ఉదయ రాణి, సి.ఎస్.డబ్ల్యూ ఎస్.వి.డి.ప్రసాద్ ఏ.ఆర్. ఏ.డి.సి.పి. కె.కోటేశ్వర రావు, ఎ.సి.పి. కృష్ణం రాజు, ఎ.సి.పి. ప్రేమ్ కుమార్‌లు, ఆర్.ఐ.లు, ఆర్.ఎస్.ఐ.లు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# సంపాదకీయం

## బీజేపీ టార్గెట్ సౌత్



రానున్న అసెంబ్లీ ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ సన్నద్ధమవుతున్నది. పార్టీ జాతీయ అధ్యక్షుని ఎన్నికకు ఇంకా సమయం పట్టవచ్చు. ఆ ఎన్నికలో జరుగుతున్న జాప్యం అటుంచితే, ఇటీవలే ఆరు రాష్ట్రాలకు పార్టీ కొత్త అధ్యక్షులను నియమించింది. కనుక ఎన్నికల ప్రక్రియలో భాగంగా జేపీ నడ్డా వారసుని ఎంపిక కొద్ది వారా ల్లో ము గియవచ్చు. నిజానికి పొడిగించిన ఆయన పదవీకాలం కూడా ముగిసి నెలలైంది.పార్టీ నియమావళి ప్రకారం దేశంలోని సగం రాష్ట్రా ల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తయితే గానీ, జాతీయ అధ్యక్షుని ఎన్నికకు మార్గం సుగమం కాదు. ఇప్పుడు ఆరు రాష్ట్రాలకు కొత్త అధ్యక్షులను నియమించుకోవడంతో ఇక జాతీయ అధ్యక్షుని ఎన్నిక ఒక్కటే మిగిలివుంది. రాష్ట్రాల చీఫ్‌లు నాయకులను ఎంపిక చేయడంలో వారికి సం స్థాగతంగా ఉన్న అనుభవాన్ని అధిష్ఠానం పరిగణలోకి తీసుకున్నట్టు స్పష్టమైంది.నడ్డాకు వారసుణ్ణి ఎంపిక చేయడంలో పార్టీకి, ఆర్ఎస్ఎస్‌కు మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడమే ఆలస్యానికి కారణమనే ఊహాగానాలు వినిపించాయి. సంఘ్ పరివార్‌తో ఏకాభిప్రాయం కుదిరిన వెంటనే జాతీయ కమల దళపతి పేరు ప్రకటించే అవకాశం ఉంది. బీహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు, కేరళ, పంజాబ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీలకు కొద్ది నెలల్లో ఎన్నికలు జరుగనున్నాయి. కీలకమైన ఈ రాష్ట్రాల్లో బీజేపీకి విజయం అందించడం పార్టీ కొత్త అధ్యక్షుడికి సవాల్ కానున్నదిదక్షిణాన తమిళనాడు, తెలంగాణపై దృష్టి నిలిపిన బీజేపీ తన వ్యూ హాల అస్త్రాలను ఇప్పటికే బయటకు తీసింది. తమిళనాడులో అన్నాడీఎంకేతో పొత్తుపెట్టుకున్న బీజేపీ, కొత్త పార్టీతో ముందుకెళ్తున్న తమిళ పాపులర్ నటుడు విజయ్‌పై కన్నేసింది. అయితే, బీజేపీతోగానీ, డీఎంకేతో గానీ తమిళ వెట్రి కళగం (టీవీకే) పొత్తుపెట్టుకునే ప్రసక్తే లేదని, వచ్చే ఏడాది రాష్ట్ర అసెంబ్లీకి జరుగనున్న ఎన్నికల్లో తనే ముఖ్యమంత్రి అభ్యర్థినని విజయ్ ప్రకటించుకున్నారు.పార్టీ కార్యనిర్వాహక కమిటీ ఈమేరకు తీర్మానం కూడా ఆమోదించింది. ఈ పరిస్థితుల్లో అధికార డీఎంకేను ఎదుర్కోవడంలో అన్నా డీఎంకేతో కలిసి బీజేపీ ఎలాంటి వ్యూహం అనుసరిస్తుం దనేది చూడాలి. మరోవైపు, బలవంతంగానే అన్నా డీఎంకేను బీజేపీ పొ త్తుకు ఒప్పించిందన్న ఊహాగానాల మధ్య, ఇదీ నిజమేనన్న తీరులో పళనిస్వామి మాటలు వినిపిస్తున్నాయి. బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నా, సీట్ల పంపకం మొదలు ఏ విషయంలోనైనా అన్నాడీఎంకే పెద్దన్న పాత్రలో ఉంటుందని పళినిస్వామి చెపుతున్నారు.దక్షిణాది రాష్ట్రాల్లో, ముఖ్యంగా మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటకల్లో హిందీ భాష పట్ల వ్యక్తమవుతున్న వ్యతిరేకత తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం చూపనున్నది. ఈ పరిస్థితి దృష్టిలో పెట్టుకుని బీజేపీని పూర్తిగా తలెత్తుకోవడం అన్నాడీఎంకేకు ఇబ్బందిగా వుంది. తమిళనాడు అసెంబ్లీ సీట్ల పంపకం చెరి సగంగా ఉండాలని కేంద్ర మంత్రి అమిత్‌షా ఇప్పటికే పళనిస్వామికి ఖరాఖండికి చెప్పినట్టు వార్తలు వచ్చాయి. ఇక తెలంగాణలో గత అసెంబ్లీ ఎన్నికల్లో మంచి ఫలితాలనే సాధించిన బీజేపీ, కొత్త అధ్యక్షుడు రాంచందర్‌రావు నాయకత్వంలో అధికార పీఠం చేజిక్కించుకునే వైపునకు కదులుతున్నది.రానున్న ఏడాది కాలంలో బిహార్, అస్సాం, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ ఎన్నికలు జరుగనున్నాయి. వీటిలో మెజారిటీ రాష్ట్రాల్లో గెలవడం బీజేపీకి ఒక అగ్నిపరీక్ష లాంటిది. ముఖ్యంగా దక్షిణాదిన బీజేపీ విస్తరించడం అంత సులభం కాదుఅయితే కేవలం సంఘ్ అండదండలు ఉన్నంత మాత్రాన బీజేపీ విజయాలు సాధించగలుగుతుందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. నిజానికి సంఘ్ బలంగా ఉండడం వేరు, బీజేపీ బలంగా ఉండడం వేరు అన్న విషయం రెండు సంస్థలకూ తెలియనిది కాదు సంఘ్ అత్యంత బలంగా ఉన్న కర్ణాటకను ఒకప్పుడు బీజేపీ దక్షిణాది ద్వారంగా ఆ పార్టీ నేతలు అభివర్ణించారు. కాని క్రమంగా ఆ ద్వారం మూసుకుపోతున్నట్లు కనపడుతోంది. దేశమంతటా హిందూత్వ ప్రయోగం విజయవంతం అవుతున్నట్లు కనపడుతున్నప్పటికీ కర్ణాటకలో మాత్రం ఈ ప్రయోగం లింగాయత్‌ల అదుపులో ఉన్నట్లు స్పష్టమవుతోంది. అక్కడ పార్టీలో ఉన్న అంతర్గత పోరాటాన్ని అధిష్ఠానం అరికట్టలేకపోతోంది.

నేతలు ఒకరిపై మరొకరు మీడియా కెక్కుతున్నారు. యడ్యూరప్పను, ఆయన కుమారుడు విజయేంద్రను మచ్చిక చేసుకునేందుకు ఇటీవల బలమైన ఎమ్మెల్యేను బసనగౌడ పాటిల్ యత్నాల్‌ను పార్టీ నుంచే బహిష్కరించారు. బీజేపీకి కర్ణాటకలో భవిష్యత్ లేదని త్వరలో ఒక కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తానని యత్నాల్ ప్రకటించారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యను అప్రతిష్ఠపాలు చేసేందుకు ముడా కుంభకోణాన్ని లేవనెత్తి, ఈడీని ప్రయోగించినా బీజేపీ విజయవంతం కాలేకపోయింది. విచిత్రమేమంటే సంఘ్ హేమాహేమీలు దత్తాత్రేయ హోసబలె, సిఆర్ ముకుంద్, ప్రస్తుతం జాతీయ స్థాయిలో సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా ఉన్న సంతోష్, హెచ్‌వి శేషాద్రి, పద్మనాభాచార్య తదితరులు ఆ రాష్ట్రానికి చెందినవారే. ఒకప్పటి సర్ సంఘ్ చాలక్ సుదర్శన్ కూడా మైసూరుకు చెందినవారే. నిజానికి మహారాష్ట్ర తర్వాత అత్యధిక సంఖ్యలో అగ్రశ్రేణి సంఘ్ నేతలు కర్ణాటక నుంచే వచ్చారు. కాని అదే కర్ణాటకలో ఇప్పుడు బీజేపీ రాజకీయ భవిష్యత్తు డోలాయమాన పరిస్థితిలో ఉన్నది. సంతోష్ జీ వల్లే దక్షిణాదిలో బీజేపీ దెబ్బతిన్నదని విమర్శలు చేసేవారు కూడా ఉన్నారు. తమిళనాడులో ఐపీఎస్ అధికారి అన్నామలైను ప్రవేశపెట్టి ఓట్ బ్యాంకును పెంచుకునేందుకు బీజేపీ చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో మళ్లీ అన్నాడీఎంకెపై ఆధారపడవలసిన స్థితి ఏర్పడింది. కేరళలో కూడా ఆర్ఎస్ఎస్ బలంగా ఉన్నా బీజేపీ కొంత ఓటు శాతాన్ని పెంచుకోవడం తప్ప అసాధారణమైన విజయాలేమీ సాధించలేదు.ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే నెల్లూరులో ఆర్ఎస్ఎస్ తొలి శాఖ 1947లోనే ఏర్పడింది. 1948లో విజయవాడలో ఆర్ఎస్ఎస్ అతి పెద్ద సభను నిర్వహించింది. 1950లలో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన తొలి ఓటీసీ నెల్లూరులో జరిగింది. మహారాష్ట్ర నుంచి వచ్చిన దేశ్‌పాండే, బాపురావు మోఘే, బందిష్టే, గోపాల్‌రావు టాగోర్‌తో పాటు కరెడ్ల సత్యనారాయణ, భండారు సదాశివరావు, సోమెపల్లి సోమయ్య లాంటి వారు సంఘ్‌ను ఏపీలో నిర్మించారు. గుంటూరులో శాఖకు హాజరైన వారిలో మాజీ ముఖ్యమంత్రులు ఎన్టీరామారావు, భవనం వెంకటరామ్, సీనియర్ జర్నలిస్టు పొత్తూరి వేంకటేశ్వరరావు లాంటి వారున్నారని ఒక ఆర్ఎస్ఎస్ నేత తన ఆత్మకథలో రాశారు. నిజానికి హైదరాబాద్ స్టేట్‌లో ఆర్యసమాజ్ మూలంగా ఆర్ఎస్ఎస్‌కు అనుకూల వాతావరణం ఉండేది. 1947లోనే గోల్వాల్కర్ హైదరాబాద్‌కు రహస్యంగా వచ్చారు. 1949లో శ్రీరాంసాథే ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలను ప్రారంభించారు. నృపతుంగ, కేశవ మెమోరియల్ లాంటి విద్యాసంస్థలను సంఘ్ అభిమానులను ప్రారంభించారు. నక్సల్బరీ ఉద్యమానికి పోటీగా 1967లోనే ఏబీవీపి ఏర్పడింది. తొలి ఏబీవీపి విద్యార్థి సదస్సు 1967 జూలైలో జరిగింది. 1968లో అఖిల భారత ఏబీవీపి సదస్సు జరిగినప్పుడు సుప్రీం మాజీ ప్రధాన న్యాయమూర్తి కోకా సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తర్వాత క్రమేణా ఏబీవీపీ తెలంగాణలోని అనేక కాలేజీల్లో బలపడింది. అయినప్పటికీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యామ్నాయ భావ జాలం బలంగా ఉండడం వల్ల జనసంఘ్ ఉనికి ఏర్పర్చుకోలేకపోయింది. తర్వాతికాలంలో తెలుగుదేశం బలమైన ప్రాంతీయ పార్టీగా ఏర్పడడంతో బీజేపీ నిలదొక్కు కోలేకపోయింది. రాజకీయాల్లో ప్రత్యర్థులను బలహీనపరచడంవల్లనో, భావోద్వేగాలను సృష్టించడంవల్లనో లభించే విజయాలు ఎప్పటికైనా తాత్కాలికమవుతాయి. మనను నడిపిస్తున్న లక్ష్యాలేమిటి? రాజకీయాల్లో మనం ఎందుకు ప్రవేశించాం, ఆదర్శాలు, విశ్వాసాల కన్నా వ్యక్తులకు మనం ప్రాధాన్యత కల్పిస్తు న్నామా అన్న ప్రశ్నలు వేసుకుని ముందుకు సాగకపోతే విజయాలు వైఫల్యాలుగా మారేందుకు ఎంతో కాలం పట్టదు. కాంగ్రెస్ అదే పరిస్థితిని ఎదుర్కొన్న విషయం తెలియనిది కాదు.

# ఇండోసోల్ ప్రాజెక్టు..

# అప్పుడు అలా... ఇప్పుడు ఇలా

నెల్లూరు - సూర్య వాస్తవం




వేలాది మంది రైతులు.. గొంతెత్తి అరుస్తున్నారు.. రోడ్డెక్కి నినదిస్తున్నారు? దీనంగా మొరపెట్టుకుంటున్నారు.. అయినా ఏలిన వారు స్పందించడం లేదు. దక్షిణ కోస్తా ప్రాంతంలో ఇండోసోల్ సంస్థ ఏర్పాటు చేస్తున్న ఓ సోలార్ కంపెనీకి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమం ఇది. తమ పొలాలు పోతున్నాయని.. రైతులు రగిలిపోతుంటే.. ప్రభుత్వం సెలెంట్.. ప్రభుత్వాధినేతా సైలంట్.. అధికార పార్టీ సెలంట్.. మిత్రపక్షాలు సెలంట్.. ప్రతిపక్షాలూ.. సైలంట్.. టోటల్‌గా ఓ నిశ్శబ్దమే రాజ్యమేలుతోంది..నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలంలోని కరేడు గ్రామపంచాయతీ పరిధిలోని ఓ 15 గ్రామాల పరిధిలో షుమారు 4500 ఎకరాల్లో భూసేకరణకు జూన్ 22న నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ భూమి సేకరణ ఎందుకంటే..ఇండోసాల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ ఆ సంస్థ ఈ ప్రాంతంలో సోలార్ పీవీ మాడ్యూల్స్ తయారు చేస్తుంది. ఇది దేశంలోనే అతిపెద్ద, ఇంటిగ్రేటెడ్ సోలార్ ప్యానల్స్ తయారీ ప్లాంట్ అని చెబుతున్నారు. 8,000 ఎకరాల్లో 5ఉచి చొప్పున మొత్తం రెండు దశల్లో 10ఉచి సామర్థ్యంతో దీనిని నిర్మించనున్నారు. పరిశ్రమలో సోలార్ సెల్స్, వాఫర్స్, పాలిసిలికాన్, గ్లాస్ ప్యానెల్స్ తయారీతో పాటు అనుబంధ పరిశ్రమలు, టౌన్‌షిప్, ఇతర మౌలిక వసతులు కూడా ఉంటాయి. మొత్తం రూ. 25,000 కోట్ల పెట్టుబడితో 23,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పించే అవకాశం ఉందని కంపెనీ చెబుతోంది.అంతపెద్ద పెట్టుబడితో.. ఇంత పెద్ద పరిశ్రమ వస్తుంటే సంతోషించాలి కానీ... మరి వివాదం ఎందుకు..?ఎందుకంటే. పచ్చని పొలాలతో.. పకృతి రమణీయంగా ఉన్న ఈ ప్రాంతాన్ని పరిశ్రమ కోసం ఎంపికచేయడమే సమస్య..! ఇక్కడ ఉన్న భూమిని తీసుకుని పరిశ్రమకు ఇవ్వడానికి రైతులు ఒప్పు కోవడం లేదు. తమ భూమిని ఇవ్వం అని తెగేసి చెబు తున్నారు. ఎక్కడ పరిశ్రమ ఏర్పాటు అయినా రైతుల నుంచి అభ్యంతరాలు తప్పవు. కాకపోతే.. పంటలు సరిగ్గా పండని బంజరు ప్రాంతాలు, నీటి సౌకర్యం తక్కువ ఉన్న పొలాలను.. వీటికోసం ఎంపిక చేస్తారు. వ్యవసాయం కంటే.. అక్కడ ఉపాధి అవసరం ఎక్కువ ఉన్న భూములు తీసుకుంటారు. కానీ ఇలాంటి సారవంతమైన భూములను తీసుకుంటా మనడంతో గొడవ మొదలైంది. రైతులు తమ జీవనాధారం కోల్పోతామని, ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నారు. జూన్ 29 న వీళ్లు జాతీయ రహదారిని దిగ్బంధించారు. గ్రామసభల్లో తమ భూములు ఇవ్వమని చెప్పేశారు.మరి ఇంత జరుగుతుంటే.. సంబంధిత మంత్రి? గొట్టిపాటి రవికుమార్ మాట్లాడలేదు. ? ఒకప్పుడు ఈ ప్రాంతం ప్రకాశం జిల్లా లోనే ఉండేది ఆయన ఆ జిల్లా మంత్రి కూడా..! డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడటం లేదు. చిన్న విషయానికి కూడా స్పందించే సీఎం చంద్రబాబు నోరెత్తడం లేదు.. ఆ పార్టీ నేతలు అధికారికంగా స్పందించడం లేదు. ఆ పార్టీ భవిష్యత్ అని చెప్పే నారా లోకేష్ నో రెస్పాన్స్? అన్యాయం జరిగితే నినదిస్తా అని చెప్పే కూటమి మిత్రుడు పవన్ కల్యాణ్ పత్తాలేరు.. బీజేపీ నోరెత్తడం లేదు. ఇలా మొత్తం సర్కారు వారి సైలెన్స్ లా పరిస్థితి ఉంది.ఈ విషయంలో ప్రభుత్వం కు మేలు చేయడానికి ప్రయత్నాలు చేస్తోందని అందరూ అనుకునేలా వాళ్ల వ్యవహారశైలి ఉంది. కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకోవడానికి ప్రధాన కారణం.. ఈ ప్రాజెక్టును అధికారంలోకి రాకముందు తీవ్రంగా వ్యతిరేకించారు. ఎలక్షన్‌కు ముందు ఆ పార్టీకి వాయిస్ గా ఉన్న లోకేష్ తన పాదయాత్రలో ఇండోసోల్‌ను కంపెనీ అన్నారు. మరి అప్పటి ఫేక్ కంపెనీ రెండేళ్లలో కంపెనీ అయిపోయిందా అని జనం ప్రశ్నిస్తున్నారు. ఒకసారి లోకేష్ అప్పుడు ఏం చెప్పారో చూడండి..కనీసం లక్ష రూపాయల కేపిటల్ లేనటువంటి.. కంపెనీ 72వేల కోట్ల పెట్టుబడులు పెడుతందా అన్నది ఆయన ప్రశ్న. మరి ఈ రెండేళ్లలో పెట్టుబడులు ఎక్కడ నుంచి తెచ్చింది ఇండో సోల్ సంస్థ షిరిడిసాయి ఎలక్ట్రికల్స్ కు చెందిన సబ్సిడరీ కంపెనీ.. ఈ సంస్థకు కిందటి జగన్ మోహనరెడ్డి ప్రభుత్వం ఆయాచిత లబ్ది చేకూర్చిందని తెలుగుదేశం పదే పదే ఆరోపించింది. ట్రాన్స్ ఫార్మర్లలో దోపిడీ చేసిందన్నారు. స్మార్ట్ మీటర్లతో దోచుకున్నారు అని చెప్పారు. అసలు ఆ కంపెనీలో జగన్ బినామీ అని కూడా చెప్పారు. మరి అలాంటి కంపెనీపై అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది.. ఎందుకు విచారణ జరిపించడం లేదు. అది చేయకపోగా.. ఇలా భూములను ఎందుకు కట్టబెడుతున్నారు..పరిశ్రమలు రావడం అవసరమే కానీ.. నిజంగా దానికి అంత భూమి ఎందుకు.. కిందటి ప్రభుత్వం 5వేలు ఎకరాలు ప్రతిపాదిస్తే ఇప్పుడు 8వేల ఎకరాలు ఎందుకు అడుగుతున్నారు...?అంత పెట్టుబడిని ఎక్కడ నుంచి తీసుకొస్తుంది.. వీటికి దేనికీ సమాధానాలు లేవుసహజంగా అధికారపక్షం వైపు తప్పు ఉంటే ప్రతిపక్షం రాజకీయ లబ్ది కోసమైనా దానిని టేకప్ చేస్తుంది. కానీ ఇక్కడ కరేడు వాసులది దీనస్థితి.. తెలుగుదేశం ప్రభుత్వం, పార్టీ అధికారి కంగా స్పందించకపోయినా.. ఆ పార్టీ లోకల్ నాయకత్వం, సానుభూతి పరులు వాళ్లకి మద్దతు తెలుపు తున్నారు. కానీ దీనిపై స్పందించాల్సిన మాత్రం పూర్తి సైలంట్. కొంతమంది రౌడీషీటర్లను కొడితేనే పనిగట్టుకుని వెళ్లి పరామర్శించి వచ్చిన జగన్ మోహనరెడ్డికి కనీసం దీనిపై స్పందించడం లేదన్నది వాళ్ల ఆవేదన. ఈ ప్రాజెక్టు యాజమాన్యానికి వైసీపీకి సంబం ధాలున్నాయన్న మాట నిజం అనుకోనేలా ఉంది ఆయన స్పందన. కూటమిలో భాగస్వామిగా ఉన్న పవన్ కల్యాణ్ కొన్ని సందర్భాల్లో నేరుగా వెళ్లి మాట్లాడారు.

# జనవరి నుంచి

# మరో 62 అన్నా క్యాంటీన్లు




కాకినాడ - సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ప్రారంభించిన అన్న క్యాంటీన్‌లపై ప్రజల్లో పాజిటివ్ రెస్పాన్స్ ఉంది. అందుకే దీన్ని ప్రతి అసెంబ్లీ నియోజవర్గంలో ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఇప్పటికే దాదాపు 113 నియోజక వర్గాల్లో అన్న క్యాంటీన్లు ఉన్నాయి. ఇప్పుడు మిగతా 62 నియోజకవర్గాల్లో క్యాంటీన్లు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. వచ్చే జనవరి నాటికి ప్రతి నియోజకవర్గంలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం బిల్డింగ్‌లు నిర్మిస్తుంది. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో ప్రక్రియ కూడా ప్రారంభించేశారు. ఈ భవనాలను డిసెంబర్‌కు పూర్తి చేసి జనవరిలో అన్న క్యాంటీన్లు ప్రారంభిం చాలని చూస్తున్నారు. ఈ మేరకు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రూ.61 లక్షలతో ఒక్కో భవనం నిర్మిస్తున్నారు. అంటే ఇప్పుడు కొత్తగా నిర్మించే భవనాలకు ప్రభుత్వం రూ.41.70 కోట్లు ఖర్చు చేస్తుంది. పేదలి ఆకలి తీర్చేందుకు ఈ అన్న క్యాంటీన్ కాన్సెప్ట్ తీసుకొచ్చారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 205 అన్న క్యాంటీన్‌లు ఉన్నాయి. వాటిలో 1,84,500 మంది ఫుడ్ తీంటున్నారు. దీనిపై ప్రభు త్వం నెలకు రూ.11 కోట్లు ఖర్చు చేస్తోంది. అంటే ఏడాదికి రూ.132 కోట్లు వెచ్చిస్తోంది. అన్న క్యాంటీన్‌లలో ఐదు రూపా యలకే అన్నం పెట్టడంతో ఈ క్యాంటీన్లు ప్రజా దరణ పొం దాయి. ఉదయం టిఫిన్ మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం కూడా పెడుతున్నారు. ఇలా ఫుడ్ పెట్టేందుకు టిఫిన్‌పై 17 రూపాయలు, మధ్యాహ్నం, రాత్రి భోజనంపై చెరో 29 రూపాయలు ఖర్చు చేస్తోంది. మొత్తంగా ఒక వ్యక్తి అన్న క్యాంటీన్‌లో మూడు పూటల భోజనం చేస్తే ఆ వ్యక్తిపై 75రూపాయలు ఖర్చు పెడుతున్నందన్నమాట. క్వాలిటీ ఫుడ్ ఐదు రూపాయలకే పెడుతుండటంతో నియోజక వర్గస్థాయిలో పెడితే మంచిందనే ఆలోచన ప్రజల్లో వచ్చింది. ఇదే విషయాన్ని ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన చంద్రబాబు 70 అన్న క్యాంటీన్‌లు ఏర్పాటుకు ఓకే చెప్పారు. ఇప్పుడు ఉన్నవి ఎక్కువ పట్టణ, నగర ప్రాంతాలకే పరిమితం అయ్యాయి. అందుకే ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో క్యాంటీన్ ఉండేలా సర్దుబాటు చేస్తున్నారు. కొత్తగా మరో 62 నిర్మిస్తున్నారు. వాటిని జనవరిలో ప్రారంభించేలా ప్లాన్ చేస్తున్నారు.

# వైసీపీ నేతలు స్ట్రీట్ ఫైట్‌కు సిద్ధమవుతున్నారా?

విజయవాడ - సూర్య వాస్తవం



ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ నాయకులకు భయం పోయినట్లుంది. ఇన్నాళ్లు రెడ్ బుక్ అని భయపడి కొంత వెనక్కు తగ్గిన వారు ఇప్పుడు తలెత్తి మరీ తొడకొడుతున్నారు. నిన్న మొన్నటి వరకూ ఇద్దరు ముగ్గురు వైసీపీ నేతలు మాత్రమే బయటకు వచ్చి అధికార పార్టీపై విమర్శలు చేసేవారు. వరస కేసులు నమోదవుతుండటంతో పాటు అక్రమ కేసులు బనాయి స్తుండటంతో కొంతకాలం మౌనం పాటించడమే మంచిదని భావించి తమ నియోజకవర్గానికే కొందరు వైసీపీ నేతలు పరిమితం కాగా, మరికొందరు మాత్రం వ్యాపారాలు చూసు కుంటూ రాజకీయాలకు దూరంగా కాలం వెళ్లబుస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏడాది అయిన తర్వాత మాత్రం నేతలందరూ ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు.ఏడాదిలోనే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడటంతో పాటు ప్రధా నంగా తమకు కూటమి వల్ల ఇబ్బందులుగా ఉన్న తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోనూ కొంత అనుకూలత కనిపిస్తుండ టంతో ఇప్పుడిప్పుడే మీడియా ముందుకు వచ్చి అధికార పార్టీపై విమర్శలు చేస్తున్నారు. వల్లభనేనివంశీ, పోసాని కృష్ణమురళి, నందిగం సురేష్, కాకాణి గోవర్ధన్ రెడ్డి లాంటి వారు జైలుకెళ్లి బయటకు వచ్చారు. కేసులు పెట్టినా మహా అయితే రెండు నుంచి మూడు నెలలు జైల్లో ఉంటామని, ఆ తర్వాత నియోజకవర్గంలో సానుభూతి పెరగడంతో పాటు తమకు వచ్చే ఎన్నికల్లో అడ్వాంటేజీగా మారుతుందని లెక్కలు వేసుకుంటున్నారు. అందుకే దమ్ముంటే కేసులు పెట్టుకోవాలంటూ సవాల్ విసురుతున్నారు.

వైఎస్ జగన్ పదే పదే వచ్చే ఎన్నికల్లోనూ గెలుపు తథ్యమని చెబుతుండటంతో పాటు అవసరమైతే కొత్త తరం నేతలను ఎంపిక చేస్తామని చెబుతుండటంతో ఇక బయటకు రాక తప్పడం లేదు. ప్రధానంగా జగన్ కూడా ఎవరు ఈ ఏడాది నుంచి యాక్టివ్ గా ఉన్నారు? ఎవరు ప్రజలకు, కార్యకర్తలకు దూరంగా ఉన్నారన్న లెక్కలు తీస్తున్నారట. వారు ఇన్నాళ్లు బయటకు రాకపోవడానికి గల కారణాలపై కూడా నివేదికలు తెప్పించుకున్నారని తెలిసిన నేతలు ఇక అసలుకే ఎసరు వస్తుందని భావించి ఇప్పుడు స్ట్రీట్ ఫైట్ కు సిద్ధమయ్యారు. జగన్ కూడా వరసగా కార్యక్రమాలను ఇస్తుండటం, ఏ నియోజకవర్గాల్లో ఎవరు పాల్గొన్నారన్నది రిపోర్టులు తెప్పించు కోవడంతో కొంత నేతల్లోనూ అలజడి స్టార్టయిందం టున్నారు. మొన్నటి వరకూ ఉత్తరాంధ్ర నేతలు పెద్దగా యాక్టివ్ గా లేరు. అలాగే తూర్పు గోదావరిజిల్లా నేతలు కూడా తమకు రాజకీయ భవిష్యత్ ఉంటుందా? లేదా? అన్నసందేహంలో ఉన్నారు. అయితే కాపు సామాజికవర్గంలోనూ కొంత సానుకూలత ఏర్పడటంతో పాటు జగన్ వైపు కొన్ని వర్గాలు మొగ్గు చూపుతు న్నాయని తెలుసుకున్న నేతలు ఇక దూకుడుగా వెళ్లాలని నిర్ణయించుకున్నట్లే కనపడుతుంది.

మరొక వైపు ఏదో ఒక సమస్యపై జగన్ జిల్లాల పర్యటనలకు వస్తుండటంతో కూడా తమ ప్రాంతానికి వచ్చినప్పుడు జగన్‌కు తప్పుడు సమాచారం ఎవరైనా ఇస్తారేమోనని చెప్పి కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారట. పార్టీ కార్యాలయంతో పాటు నియోజకవర్గం లోనే ఉంటూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారని చెబుతున్నారు. మొత్తం మీద ఏడాదిలోనే ఫ్యాన్ పార్టీలో ఎంత మార్పు అని సొంత పార్టీ నేతలే ముక్కున వేలేసుకుంటున్నారు.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



## న్యూఢిల్లీకి వెళ్లిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

**- న్యూఢిల్లీలో నిర్వహించే జాతీయ డిఎంఎఫ్ వర్క్‌షాప్‌నకు అనంతపురం జిల్లా కలెక్టర్**



అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జులై 08: అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. న్యూఢిల్లీలో నిర్వహించే జాతీయ డిఎంఎఫ్ వర్క్‌షాప్‌నకు అనంతపురం జిల్లా కలెక్టర్ హాజరు కానున్నారు. జులై 9, 2025 న న్యూ ఢిల్లీ నందు జరిగే జాతీయ డిఎంఎఫ్ వర్క్‌షాప్‌కు హాజరు కావడానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం (గనులు) శాఖ ప్రభుత్వ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, వైయస్సార్ కడప జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి, కర్నూలు జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా, ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ డి.కె., అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ లకు ప్రభుత్వం నుంచి అనుమతి ఇవ్వబడింది. ఈ మేరకు జాతీయ డిఎంఎఫ్ వర్క్‌షాప్‌నకు హాజరయ్యేందుకు మంగళవారం జిల్లా కలెక్టర్ న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

## కళాశాల వద్ద గుట్కాలు అమ్మితే చర్యలు తప్పవు

**- ఆదోని డీఎస్పీ హేమలత**



ఆదోని - సూర్య వాస్తవం, జూలై 8:

ఆదోని పట్టణంలో ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ లో భాగంగా డి.ఎస్.పి హేమలత ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం నాడు విస్తృత దాడులు నిర్వహించారు. స్కూల్ కళాశాల సమీపంలో గుట్కాలు, సిగరెట్లు అమ్ముతున్న షాపులో సరుకును సీజ్ చేసి జరిమానా విధించారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి హేమలత మాట్లాడుతూ కళాశాల స్కూలకు 100 మీటర్ల వరకు ఎటువంటి మత్తు పదార్థాలు అమ్మినా బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్లు తాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటివరకు పలు షాపుల్లో దాడులు నిర్వహించామని, బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్లు తాగుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

## పోట్ల గిత్త సినిమా మంచి సందేశాత్మక చిత్రం : తులసి రెడ్డి



వేంపల్లి - సూర్య వాస్తవం, జూలై 8: త్వరలో సెన్సార్ కు పోయి విడుదల కాబోతున్న పోట్ల గిత్త సినిమా మంచి సందేశాత్మక చిత్రం అని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. సోమవారం పోట్ల గిత్త సినిమా బృందం తో కలిసి తులసి రెడ్డి ప్రివ్యూ షో చూసారు. అడవుల వల్ల కలిగే ప్రయోజనాలు, చెట్లను నరకడం వల్ల కలిగే అనర్థాలను, ప్రత్యేకించి ఎర్ర చందనం చెట్లను నరకడం వల్ల వచ్చే దుష్ప్రభావాలను సినిమాలో ప్రభావ వంతంగా దర్శకుడు చూపించారు. పొట్లగిత్త సినిమా షూటింగ్ కడప జిల్లాలో పులివెందుల, కోరగుంట పల్లె, గొల్లల గూడూరు, పెద్దన పాడు, అనిమేల, సంగమేశ్వర దేవస్థానం, మాచుపల్లి రేణుకమ్మ తల్లి దేవస్థానం పరిసర ప్రాంతాలలో జరిగింది. మాజీ రాజ్య సభ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి హీరో తండ్రిగా,పాఠశాల హెడ్ మాస్టర్‌గా నటించారు. విలన్ పాత్రలో వీరప్పన్ గా సింగం మహేష్ అద్భుతంగా నటించారు. నటించారు అనడం కంటే జీవించాడు అని చెప్పాలి. ఈ సినిమా నిర్మాత గంగారపు మాధవ్ రెడ్డి, దర్శకుడు యం.వెంకట్, హీరో మానస్. హీరోయిన్లు కీర్తన, ప్రియాంక, యం.పి పాత్రలో కొత్తపు శ్రీనివాస రెడ్డి, అతిథి పాత్రలో విజయ్, నాగార్జుల నటించారు. త్వరలో విడుదల అవుతుంది. చూడవలసిందిగా తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## సబ్సిడీతో విత్తనాలు పంపిణీ

**- రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం**

**- బీజేపీ మండల అధ్యక్షులు కె.బి.దామోదర్ నాయుడు**



ప్యాపిలి - సూర్య వాస్తవం, జూలై 8:

నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం చంద్రపల్లె గ్రామం లో రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ద్యేయమని, ప్రభుత్వం రైతులకు రాయితీపై అందజేసిన వేరుశనగ విత్తనాలను మంగళవారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రభుత్వం ఒక్కో రైతుకి మూడు వేరుశనగ విత్తన పాకెట్లను అందజేస్తుంది అన్నారు. మూడు పాకెట్ల ధర రూ.9300 కాగా 40 శాతం రాయితీ పోను రైతు 5580 రూ. చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమం లో వి. హెచ్. ఏ. వినిత్, టిడిపి నాయకులు ఆది నారాయణ, రెడ్డి, సుధాకర్ రాజు, రామ్మోహన్ చంద్రమోహన్, సుంకన్న, రామసుబ్బయ్య, రైతులు పాల్గొన్నారు.

# జన హృదయ నేత.. డాక్టర్ వైఎస్ఆర్

**- వైఎస్ చలవతోనే రాయలసీమకు కృష్ణా జలాలు - రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత వైఎస్‌దే..!**

**- ఫీజురీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీతో పేదల జీవితాల్లో వెలుగు - వైఎస్ఆర్ స్ఫూర్తితోనే వైఎస్ జగన్ ఐదేళ్ల పాలన**

**- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టీకరణ - అనంతలో మహానేత వైఎస్ఆర్‌కు ఘన నివాళి**

**- సేవా కార్యక్రమాలు చేపట్టిన వైసీపీ శ్రేణులు - రక్తదానం చేసిన 130 మంది నాయకులు, కార్యకర్తలు**





అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 08:

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జన హృదయ నేత అని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి కొనియాడారు. వైఎస్ఆర్ భౌతికంగా లేకపోయినా అందరి హృదయాల్లో బతికే ఉన్నారని తెలిపారు. మంగళవారం అనంతపురంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 76 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా వైసీపీ జిల్లా కార్యాలయం వద్ద వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం వైసీపీ యువజన విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని అనంత వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. 130 మంది రక్తదానం చేశారు. అనంతరం వైసీపీ ఇంటెలెక్చువల్ వింగ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి కట్టుబడి తానీషా, రాష్ట్ర అధికార ప్రతినిధి శంకరయ్య, జిల్లా అధ్యక్షుడు రమేష్, నగర అధ్యక్షుడు జయప్రకాష్‌రెడ్డి, దాసిరెడ్డి ఆధ్వర్యంలో డెయిరీ ఆవిష్కరించారు. కమలానగర్‌లో ఉన్న 'నిరాశ్రయ' వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు.

**వైఎస్ర్ విగ్రహానికి నివాళి :** వైఎస్ఆర్ జయంతి సందర్భంగా నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న వైఎస్ విగ్రహానికి వైసీపీ శ్రేణులతో కలిసి అనంత వెంకటరామిరెడ్డి నివాళి అర్పించారు. అనంతరం ప్రభుత్వ సర్వజనాస్పత్రి వద్ద అన్నదానం నిర్వహించారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బీసీ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో సర్వజనాస్పత్రిలో 108 వాహన సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. ఆ తర్వాత వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ కాలనీ సమీపంలోని నేషనల్ పార్క్ వద్ద ఉన్న రాకేష్ వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. ఆశ్రమంలో వృద్ధులతో కలిసి అనంత వెంకటరామిరెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం లక్ష్మీనగర్‌లో ఉన్న రెయిన్‌బో అనాథాశ్రమంలో బీసీ సెల్ అనంతపురం నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మన్న ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

**వైఎస్ స్ఫూర్తితో వైఎస్ జగన్ పాలన :** వైఎస్ రాజశేఖరరెడ్డి స్ఫూర్తితోనే వైఎస్ జగన్ ఐదేళ్ల పాలన సాగిందని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. వైఎస్ఆర్ ముఖ్యమంత్రి అయ్యాక పేదరికాన్ని పారదోలడానికి అనేక చర్యలు తీసుకున్నారన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్రలో కరువును పారదోలడానికి జలయజ్ఞం ద్వారా 86 ప్రాజెక్టులకు రూపకల్పన చేశారన్నారు. ఈ రోజు రాయలసీమకు కృష్ణా జలాలు వస్తున్నాయంటే అది వైఎస్ రాజశేఖరరెడ్డి చలవతోనేనని అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు అన్ని అనుమతులు తీసుకొచ్చి పనులు ప్రారంభించిన ఘనత కూడా వైఎస్ఆర్‌దేనని తెలిపారు. పేదలకు విద్యను చేరువ చేయడానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తెచ్చారని గుర్తు చేశారు. దీని వల్ల వేలాది మంది ఉన్నత విద్యను అభ్యసించారన్నారు. అదేవిధంగా పేదలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని అందించారని తెలిపారు. 108.. 104 వాహనాలను తెచ్చిన ఘనత కూడా వైఎస్ఆర్‌దేనని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించారన్నారు. వడ్డీ వ్యాపారస్తులు పీల్చిపిప్పి చేస్తుంటే మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణాలు అందించిన ఘనత వైఎస్‌దని తెలిపారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టించి వారి సొంతింటి కలను సాకారం చేశారన్నారు. పరిపాలకుడు అంటే ఎలా ఉండాలో తెలియజేసిన నాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని కీర్తించారు. తండ్రి ఒక అడుగు ముందుకు వేస్తే ఆయన తనయుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో రెండు అడుగులు ముందుకు వేసి సంక్షేమ పథకాలు అందించినట్లు చెప్పారు. వైఎస్ స్ఫూర్తితో ఆయన ఆశయ సాధన కోసం పని చేస్తామని స్పష్టం చేశారు.

# రాయలసీమలో సామాజిక న్యాయం జరగాలి

**- రాయలసీమ ప్రజావేదక చర్చా వేదికలో వక్తలు**



అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 08:

రాయలసీమ ప్రాంతంలో సామాజిక న్యాయం చేయాలని మానహక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎస్ ఎం బాష పేర్కన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో రాయలసీమ సమస్యలపై ప్రజా ఉద్యమ కారుడు పసలూరి ఓబిలేసు అధ్యక్షతన చర్చావేదిక జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్ ఎం బాష ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సెప్టెంబర్ 14 న పసలూరి ఓబిలేసు ఆధ్వర్యంలో రాయలసీమ ప్రజా వేదిక ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో స్థానికంగా ప్రజా సంఘాలు, మేధావుల సూచనలు, సలహాలు కోసం సమావేశం ఏర్పాటు చేశారు. తర్వాత మిగతా రాయలసీమ జిల్లాలో కూడా ఇలాంటి సభలు ఏర్పాటు చేసి అందరి సూచన , సలహాలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ రాయలసీమలో సామాజిక న్యాయం జరగాల్సిన ఆవశ్యకత చాలా వుందాన్నారు. తన సామజిక ఉద్యమ చరిత్రలోమొదటి సారి సామాజిక రాయలసీమ అంశం చర్చకు వచ్చిందన్నారు. ఇది ఎంతో శుభదాయం, ఆయా వర్గాలు ప్రజాక్షేత్రం రావాల్సిన అవసరం వుంది, ఈ నేరు సందర్భానుసారంగా ఆనంద పడుతున్నానన్నారు. గతం ప్రభుత్వం జిల్లాకొక మెడికల్ ప్రభుత్వరంగంలో మంజూరు చేసిందని , ఆ కాలేజిలు నిర్మాణ దశలో వున్నాయని వాటిని ప్రైవేట్ రంగాలకు అప్పగించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఏదైనా విధానాల విషయంలో ఒకే రకంగా ఉండాలన్నారు. చివరికి మెడికల్ సీట్లు అడ్మిషన్లు కూడా అవసరం లేద కేంద్ర ప్రభుత్వాని ఉత్తరం రాయడం సరికాదన్నారు. ఇలాంటి సంఘటనలు తను ఎన్నడూ చూడలేన్నారు. దేశంలో అన్ని ఐఐటి లోనూ రిజర్వేషన్లు వున్నాయని, తిరుపతి ఐఐటిలో రిజర్వేషన్ లేక పోవడం వెనక వున్న కుట్ర ఏమని ప్రశ్నించారు. అదే విధంగా అమరావతి రాజదానిలో జరిగే ఉద్యోగ నియామకాలలో రాయలసీమ అభ్యర్థులకు అన్యాయం జరిగే ప్రమాదం వుంద్నారు. అమరావతి రాజదాని పరిధిలో జరిగే ఉద్యోగ నియామకాలకు ఫ్రీ జోన్ ఏర్పాటు చేయాలన్నారు. మిగతా వక్తలు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు వ్యవసాయం, సాగునీరు లాంటి అంశాలపై రాయలసీమ ఉద్యమాలు జరిగాయని, సామాజిక అంశాలు కూడా చర్చ చేయాలని, వాటి కోసం పోరాడాలని డిమాండ్ చేశారు. ఎయిమ్స్ ను రాయలసీమకు తరలించాలని డిమాండ్ చేశారు. నూతన జిల్లాలకు నవోదయ పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన మెడికల్ కాలేజిలను ప్రభుతమే కొనసాగించాలన్నారు. రాచేపల్లి లెదర్ పరిశ్రమను తక్షణం ప్రారంభించాలన్నారు. ఎస్ సి, ఎస్ టి విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. ఇక్కడి పరిశ్రమలలో స్థానికులకు 60 శాతం ప్రాధాన్యతనివ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక సహజన ఖనిజ వనరుల ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. వలసన నివారణ కోసం ఉపాధి హామీ పథకం ఏడాది పొడవునా కొనసాగించి, కనీస వేతనం ద్వారా రోజుకు రూ 500 కూలీ నిర్ణయుంచాలని డిమాండ్ చేశారు. స్థానిక చెరువులు, నీటి కుంటలలో ఉపాధి హామీ పథకం ద్వార పూడిక తీసి, భూగర్భ జలాలను కాపాడలన్నారు. వీటితో పాటు తుంగభద్ర - కృష్ణా జలాలలో మన వాటా కోసం పోరాడాలన్నారు. హెచ్ ఎల్ సి నీటి వినియోగం కోసం సమాంతర కాలువ అనివార్యమన్నారు. హంద్రీ -నీవా కాలువకు సిమెంట్ నిర్మాణాలు చేస్తే ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటిపోతాయని, కాలువల కోసం భూములు త్యాగం చేసిన రైతుల అన్యాయం చేయవద్దని సూచించారు. కరువు నివారణలో భాగంగా 20 శాతం భూములను పచ్చ బయళ్లుగా ఏర్పాటు చేసి పశులు, గొర్రెలకు నీటి సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. వీటి నుంచి పాడి పరిశ్రమ, గొర్రెలు, మేక పంపకం ద్వార ఉపాధి మెరుగుపడి వలసలు తగ్గితాన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సేన రాష్ట్ర అధ్యక్షులు చంద్రాచర్ల హరి, వైసిపి ఎస్ సి సెల్ రాష్ట్ర నాయకులు చామలూరి రాజగోపాల్, బిటిపి గోవింద్, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి వేమన, రాయల సీమ ప్రజా సమితి సీనియర్ నాయకు శంకర కుల్లాయప్ప , వైసిపి ట్రేడ్ యూనిన్ నాయకు రాజారత్నం, పికేఎం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విజయ్, చంద్రప్ప, ఐఎఫ్ టియు నగర అధ్యక్యకార్యదర్శులు ఎర్రిస్వామి, దావీద్, ఎస్సీ ఎస్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్ష్యకార్యదర్శులు నెరిమెట్ల ఎల్లన్న, మీనుగ రామాంజనేయుల , రాయలసీమ ప్రజా వేదిక కడప ఇన్ ఛార్జ్ అప్పాయపల్లిగంగులయ్య,విద్యార్థి విభాగం ఎం. రామకృష్ణ, మారుతి, లాయర్ లబ్బే ముత్యాలప్ప, ఇంజనీర్ లక్షినారాయణ,కెవిన్ పిఎస్ ఓబుళయ్య, రైతుకూలీ సంఘం కిష్ట, శెట్టూరు హనుమప్ప, ఓబిలేసు, జిసి, వెంకటేసులు,మధు, మునేంద్ర, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# మానవ సేవయే... మాధవ సేవ...!

**- అన్నదానం మహా దానం : డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



వేంపల్లి - సూర్య వాస్తవం, జూలై 8:

మానవ సేవయే మాధవ సేవ అని,అన్న దానం మహా దానం అని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లి లో ఉన్న అమ్మ అనాథ శరణాలయం లో స్వర్గీయ మునీంద్ర కుమార్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు అన్న దాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ ప్రార్థించే పెదాల కంటే సేవ చేసే చేతులు మిన్న అని మదర్ థెరీసా అన్నారన్నారు. అందులోనూ వృద్ధులకు, అనాథలకు సేవ చేయడం మరింత పుణ్యమన్నారు. గత అనేక సంవత్సరాలుగా వెంకట సుబ్బయ్య అమ్మ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎంతోమంది అనాథలకు సేవ చేయడం అభినందనీయమన్నారు. అన్న దానం మహా దానము. అన్నం పర బ్రహ్మ స్వరూపం. అటువంటి అన్న దానాన్ని మాజీ సైనికుడు స్వర్గీయ మునీంద్ర కుమార్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు అమ్మ అనాథ శరణాలయంలో చేయడం అభినంద నీయమ న్నారు. ఈ కార్యక్రమంలో మునీంద్ర కుమార రెడ్డి కుటుంబ సభ్యులు రామ ముని రెడ్డి, సుశీలమ్మ, కృష్ణమ్మ, మునికుమారి, చిన్న దస్తగిరి రెడ్డి, గంగా ధర్ రెడ్డి, రాములమ్మ, అనాధ శరణాలయం నిర్వాహకుడు వెంకట సుబ్బయ్య, కాంగ్రెస్ నాయకులు శ్రీయుతులు అమర్‌నాథ్ రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, భాషా తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ 76వ జయంతి వేడుకలు



హిందూపురం - సూర్య వాస్తవం, జూలై 8: ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు శ్రీ సత్య సాయి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యం.యచ్. ఇనాయతుల్లా ఆధ్వర్యంలో మంగళవారం హిందూపురం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరుపుకొన్నారు. వై ఎస్ ఆర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం కేక్ కటింగ్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. వై యస్ ఆర్ అమరహే అంటూ నినాదాలు చేశారు. ఈ సంధర్భంగా డిసిసి అధ్యక్షులు మట్లాడుతూ... పేదలకు నివాస స్థలాలు, ఆరోగ్య శ్రీ, 108, 104, ఫీజు రీయింబర్స్మెంట్ వ్యవసాయానికి ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, పావలా వడ్డీకే రుణాలు, జలయజ్ఞం తదితర పథకాల అమలు చేసిన గొప్ప వ్యక్తి వై యస్ రాజశేఖర రెడ్డి యని అన్నారు. తన పాదయాత్రతో 2004 లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి దిగ్విజయంగా పాలన సాగించి మళ్లీ 2009 లో 2 వసారి కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రమునకు సీఎం అయ్యారని గుర్తు చేసుకొన్నారు. 6 సార్లు ఎమ్మెల్యేగా, నాలుగు సార్లు పార్లమెంటు సభ్యులుగా గెలిచి అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హిందూపురం కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ఎం.ఈ.కిఫాయతుల్లా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమానితుల ఇళ్లల్లో విస్తృత తనిఖీలు



అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 8: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాలతో మంగళవారం నాడు అనంతపురం నగరంలో గంజాయి కట్టడిలో భాగంగా అర్బన్ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, త్రీటౌన్, నాల్గవ పట్టణ సి.ఐ లు శాంతిలాల్ , జగదీష్ ల ఆధ్వర్యంలో అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. స్థానిక రంగస్వామినగర్, రుద్రంపేట, డీమార్ట్ వెనుకల ప్రాంతం, తదితర చోట్ల గంజాయిపై నిఘా వేశారు. గంజాయి అమ్మినా, కొనుగోలు చేసినా, అక్రమ రవాణాలకు పాల్పడినా చర్యలు తప్పవని సూచించారు. గంజాయి నియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గంజాయి రహిత అనంతపురమే ధ్యేయంగా నిఘా మరియు తనిఖీలు చేపడుతున్నామన్నారు. చట్టాలు కఠినంగా ఉన్నాయని... గంజాయి జోలికెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి, మత్తు పదార్థాల జోలికెళితే ఆరోగ్యం నాశనమే కాకుండా ప్రాణాపాయ పరిస్థితులు దాపురించి కుటుంబాలు చిన్నాభిన్న మవుతాయని సూచించారు.

### మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా

## కలిసిన టీడీపీ యువనేత మౌర్యా రెడ్డి



రాయచోటి - సూర్య వాస్తవం, జూలై 8: కర్ణాటక రాజధాని బెంగళూరు పర్యటనకు వచ్చిన ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ, ఐటి మంత్రి నారా లోకేష్ బాబును మంగళవారం రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మేనల్లుడు తెలుగు దేశం పార్టీ రాయచోటి నియోజకవర్గం యువ నాయకుడు నిన్నంరెడ్డి మౌర్యా రెడ్డి కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలసి పలు విషయాలు చర్చించుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి యువ నాయకుడు మౌరా రెడ్డి మాట్లాడుతూ అనుకోకుండా బెంగళూరులో మంత్రి లోకేష్ బాబుతో కలవడం చాలా సంతోషంగా ఉందని ఒక ప్రకటనలు తెలిపారు.

## తుంబురు సురేష్ స్వామి శివైక్యం



నారాయణవనం - సూర్య వాస్తవం, జూలై 8: నారాయణవనం మండలం అరణ్య కండ్రిగ పంచాయతీలోని కైలాసకోన ఆలయ అర్చకులు సురేష్ స్వామి సోమవారం రాత్రి శివైక్యం చెందారు. శ్రీ కామాక్షి సమేత శ్రీ కైలాసనాథ స్వామి ఆలయంలో ఆయన ఎన్నో సేవలు అందించారు. అయినా శివైక్యం చెందడం జిల్లాలోని బ్రాహ్మణ సంఘాలకు ఒక తీరని లోటు అని, రాష్ట్ర యువజన అధ్యక్షుడు వేదం హరిప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి బాలాజీ శర్మ పుత్తూరు గాయత్రి బ్రాహ్మణ సంఘ గౌరవ అధ్యక్షుడు ఆలూరు రామకృష్ణ సంతాపం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఆయన సేవలు గురించి మనకు అందరికీ తెలుసు అర్చకులుగా ఉంటూ బ్రాహ్మణులకు ఎన్నో కార్యక్రమాలలో తన వంతు సహాయ సహకారాలు అందించిన వ్యక్తి.. ఈరోజు మన మధ్య లేకుండా పోవడం చాలా బాధాకరమైనది. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని దేవున్ని ప్రార్థిస్తున్నాము. అలాగే పుత్తూరు గాయత్రి బ్రాహ్మణ సంఘం సెక్రటరీ విజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు టి సీతారామన్ శర్మ, జిల్లా బ్రాహ్మణ సంఘాల సేవా సమితి సంయుక్త కార్యదర్శి బాలాజీ రావు, టి కె లలిత, గీత, ఆలూరు శివ రామ్, కిరణ్, సుధీర్, రమేష్ సంతాపం వ్యక్తం చేశారు.

### ఏడాది కాలంలోనే

# 118 కోట్లతో నగరంలో అభివృద్ధి చేశాం

**- ఇంకా నాలుగేళ్లలో మరింత అభివృద్ధి చేసి చూపిస్తాం - సుపరిపాలన తొలి అడుగులో ఎమ్మెల్యే దగ్గుపాటి**

**- ఏపీకి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే ఒక బ్రాండ్ : దగ్గుపాటి**



అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 8:

తొలి ఏడాదిలోనే అనంతపురం అర్బన్ నియోజక వర్గంలో 118 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. నగరంలోని 27వ డివిజన్ పరిధిలో అశోక్ నగర్ నందు ఆయన ఇవాళ సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమంలో పార్టీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నియోజకవర్గం పరిశీలకుడు లక్ష్మీనారాయణతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా, ఆకస్మికంగా ఆయన నేరుగా స్థానిక నాయకులు నిర్వహిస్తున్న ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వారితో కలిసి ఇంటింటికి వెళుతూ ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. కాలనీలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కూడా తెలుసుకున్నారు. ప్రజల నుంచి ఎమ్మెల్యే దగ్గుపాటికి మంచి స్పందన కనిపించింది. సంక్షేమ పథకాలపై కూడా హర్షం వ్యక్తమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఏడాది కాలంలోనే ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ఏపీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక బ్రాండ్ అని ఆయనపై నమ్మకంతోనే లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయన్నారు. మంత్రి నారా లోకేష్ దావోస్ పర్యటన తర్వాత 9.50 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని.. 8.5లక్షల ఉద్యోగాలు వచ్చాయన్నారు. గత ఐదేళ్లలో రాజధాని ఏది అంటే చెప్పుకునే పరిస్థితి కూడా లేకుండా చేశారన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చిన తర్వాత అమరావతి వేగం పుంజుకుందని 2029కల్లా రాజధాని పూర్తి చేస్తారన్నారు. అలాగే పోలవరం పనులు కూడా 2027 కు పూర్తిచేసే విధంగా ముందుకు సాగుతున్నారన్నారు. అనంతపురం జిల్లాలో గతంలో కియా పరిశ్రమ రావడం వల్ల.. దాని అనుబంధంగా పెద్ద ఎత్తున ఆటోమొబైల్ పరిశ్రమలు వచ్చాయన్నారు. ఇప్పుడు సోలార్, ఇతర రంగాల్లో కూడా పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని దగ్గుపాటి అన్నారు. ఒక అనంతపురం జిల్లాకే పదివేల కోట్ల రూపాయలు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు గతంలో 1800 క్యూసెక్కులు ఉండగా 3500 క్యూసెక్కులకు పెంచుతున్నారని.. జిల్లాలో సాగు, తాగునీటి సమస్య తీర్చే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిధులు కేటాయించారని దగ్గుపాటి అన్నారు. నగరంలో 750 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేస్తామన్నారు. నడిమి వంక, మరువ వంక ప్రొటెక్షన్ వాల్స్ నిర్మాణం కూడా 90 కోట్లతో చేపట్టినట్లు తెలిపారు. అక్టోబర్ 2 నాటికి డంపింగ్ యార్డ్ ను నగరానికి దూరంగా తరలిస్తామని.. అలాగే ప్రస్తుతం ఉన్న డంపింగ్ యార్డ్ లో చెత్త లేకుండా చేస్తామని స్పష్టం చేశారు. 10 నుంచి 15ఏళ్లుగా ఉన్న రోడ్ల సమస్యకు కూడా పరిష్కారం చూపించమన్నారు. తొలి ఏడాదిలోనే ఇంత అభివృద్ధి జరిగితే వచ్చే నాలుగేళ్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని దగ్గుపాటి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 27వ డివిజన్ ఇంచార్జ్ సరిపూటి శ్రీకాంత్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్న, టిడిపి రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, కార్పొరేటర్ బాలాంజనేయులు, మాజీ కార్పొరేటర్ బల్లా పల్లవి, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కృష్ణకుమార్, టిఎన్టియూసీ నగర అధ్యక్షుడు పూల భాష, మాజీ కో ఆప్షన్ సభ్యుడు మున్వర్, టిడిపి నాయకులు నారాయణస్వామి, మణికంఠ బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గుత్తిలో ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు

**- భారీగా పాల్గొన్న వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు**





గుత్తి - సూర్య వాస్తవం, జూలై 8: గుత్తి పట్టణ, మండల కన్వీనర్లు కప్పల బండ మధుసూన్ రెడ్డి, గంగారాజు యాదవ్, అధ్యక్షత గుత్తి పట్టణం, గుత్తి ఆర్‌యస్ లోని వై యస్సార్ విగ్రహాల వద్ద ఘనంగా నివాళులర్పించి, పూలమాలలు వేసి కేక్ కటింగు చేసి, ఒకరినొకరు తినిపించుకొని, ఆ మహానేత చేసిన సేవలను మరొక్కసారి స్మరించుకొని ఘనంగా నివాళు లర్పించడం జరిగింది. ప్రభుత్వ వైద్యశాలకు సుమారు 30 వేల రుపాయులు విలువగల స్వయంగా ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసుకునే ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ పరికరాన్ని గోవర్నమెంట్ ఆసుపత్రికి మున్సిపల్ వైస్ చైర్మాన్ బళ్లారి పద్మాలత రెడ్డి, సీబీ మంజునాథ్, చేతుల మీదగా సూపరడెంట్ ఎల్లప్పకి డోనేషన్ చేయడం జరిగింది. గవర్నమెంట్ ఆసుపత్రిలో వున్నా పేషంట్లకి పండ్లు, బ్రెడ్డులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ యువ నాయకుడు సిబి మంజునాథరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూరు బిఎంపీపీ గార్లపాటి, విశాలాక్షి, మున్సిపల్ వైస్ చైర్మన్ బిందె వరలక్ష్మి యాదవ్, మాజీ జెడ్పిటిసి ప్రవీణ్‌కుమార్ యాదవ్, రాష్ట్ర నాయకులు మల్లయ్య యాదవ్, మైనుద్దీన్, సివి రంగారెడ్డి, జిల్లా నాయకులు సుభాష్ రెడ్డి, గురు ప్రసాద్ యాదవ్, వైఎండ్ ఫయాజ్, మార్తాడ్ అన్సర్, రంగస్వామి, వై.పి బాబు, డిష్ అన్వర్, గుత్తి పట్టణ మండలం మాజీ కన్వీనర్లు హుసేన్ పీరా గోవర్ధన్ రెడ్డి, టౌన్ మండల వైస్ ప్రాసిడెంట్ రంగస్వామి, నెమతబాద్ రఘునాథ్‌రెడ్డి, కటిక మున్నా, బలరాముడు, మున్సిపల్ టౌన్ మహిళ ప్రాసిడెంట్ హేమలత రెడ్డి, అంగన్‌వాడి టౌన్ ప్రాసిడెంట్ ప్రియంక, కౌన్సిలర్లు నజీర్, వాల్మీకి శివ, వరదరాజులు, ఎన్.ఫారూఖ్, రమేష్ రెడ్డి, ఖాజాఖాన్, అరవింద్, ఎ.దస్తగిరి, సర్పంచులు చిన్న ఆంజనేయులు, చంద్ర, మాజిగా గోపాల్, ముఖ్య నాయకులు జీప్ రమణ, బళ్లారి హరినాథ్ రెడ్డి, షఫీ, పులుట్ల సునీల్ కుమార్, కటిక అన్వర్ చిన్నపులప్ప, శంకర్ రెడ్డి, నూరు నాయక్, తపేల మురళి, కుమేత రాజశేఖర్ రెడ్డి, రామరంగారెడ్డి, నారాయణ స్వామి, తపేల సునీల్ కుమార్, అరటి పండ్ల చంద్ర, చికెన్ వెంకటేష్, అశ్వ సురేష్, నాగేంద్రబాబు, ఓబులయ్య యాదవ్, కొత్తపేట రాముయాదవ్, బిందె సురేష్, వెంకట్రాముడు, బి.సురేష్, సుధాకర్, వెల్డింగ్ అబ్దుల్ రౌఫ్, మలికార్జున, బ్రహ్మకుమార్, పోలీస్ అబ్దుల్ గోరా మబు, భీమాలింగ, కెఎం రం గనాయకులు, 7 వ వార్డు అరుణ్ కుమార్, భాస్కర్ బాబు, నరసింహ, రంగస్వామి, జయరాం, అఖిల్, జక్కల చెరువు రంగస్వామి, ఇబ్రహీం, రంగన్న, చంద్ర, చంద్రయ్య, వరగడ్డి షేక్షావలి, బేల్దారి అన్వర్, 25 వ వార్డు హరిబాబు, వాల్మీకి, పవన్, నందు, బ్రహ్మారెడ్డి, ఎల్ఐసీ హరినాథ్ రెడ్డి, నాగరాజు, మాబాషా, శేషు యాదవ్, మురళి ఆచారి, మర్రిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రాజేష్‌బాబు, బేల్దారి చంద్ర, టి.కొత్తపల్లి చంద్ర, బేతపల్లి చంద్ర, రామచంద్ర, శ్రీ పురం కోదండ రాముడు, రాజు, అరిఫ్, ఇమ్రాన్, షానవాజ్, శ్రీరాములు, బాబా ఫక్రుదిన్, బేతపల్లి నారాయణ, చంద్ర, ఎస్‌టీ కాలనీ దేవేంద్ర, బేల్దారి దస్తగిరి, వడ్డే శివ, కోట వెంకటశేష్, చిన్నబాబు, తాజ్, కిరణ్ రెడ్డి, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

**- బైక్ ర్యాలీ నిర్వహించిన సిఐటియు - ఏఐటీయూసీ ప్రజాసంఘాలు**



పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం, జూలై 8:

లేబర్ లేబర్ కోడ్ రద్దు పై కార్మిక చట్టాల పునరుద్ధరణకై జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మంగళవారం సిఐటియు, ఏఐటియుసి, ఆధ్వర్యంలో పత్తికొండ స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సిఐటియు జిల్లా నాయకులు దస్తగిరి, ఏఐటియుసి జిల్లా నాయకులు ఎన్.కృష్ణ, జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఈ సార్వత్రిక సమ్మెలో కార్మిక సంఘాలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని, కార్మికుల పనిగంటలు లేబర్ కోడ్ కార్మిక చట్టాలు పునరుద్ధరణకు సిఐటియు, ఏఐటియుసి ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ సభ నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి డి.గోపాల్, సిఐటియు నాయకులు ఎం.రవిచంద్ర, ఏఐటియుసి మండల కార్యదర్శి ఏం.రంగన్న, ఏఐటీయూసీ నాయకులు గుండు బాషా, సిపిఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు కాశి, సిఐటియు ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రభాకర్, సివిల్ సప్లై గోడౌన్ హమాలీలు పాతపేట హమాలీలు తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు

**- తల్లికి వందనం, 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్న సీఎం చంద్రబాబు**

**- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా**



రాయచోటి - సూర్య వాస్తవం, జులై 8:

దీపం పథకంలో భాగంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని రాష్ట్ర టిడిపి కార్యదర్శి, కుప్పం పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా అన్నారు. సూపర్ పాలన లోని తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం గాజుల ఖాదర్ బాషా రాయచోటి పట్టణంలోని 11 బూత్ నందు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండగానే దీపం పథకం 1.0 అని పెట్టి మహిళా మణులు వంటింట్లో పడుతున్నటువంటి ఇబ్బందులు గ్యాస్ సిలిండర్లు ద్వారా తీర్చార ని మరలా మన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నారా చంద్రబాబునాయుడు గతంలో ఏదైతే సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారో ఆ హామి నిలబెట్టుకుంటూ దీపం 2.0 పథకం అమలు చేస్తున్నా రని ఆయన తెలిపారు. 115 వ బూతులోని ప్రజలు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే మాకు సిమెంటు రోడ్లు నిర్మించారని వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి సహాయము పొందలేదని తెలిపారు వైసిపి కౌన్సిలర్లు కూడా ఎవరో మాకు తెలియదని వారి ముఖాలు కూడా చూడలేదని తెలుపుతున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం పై నమ్మకం ఉండాదని వైసీపీ నాయకులపై నమ్మకం లేదని, రాంప్రసాద్ రెడ్డిపై నమ్మకంతో రాయచోటి శాసనసభ్యులుగా గెలిపించుకున్నామని మంత్రి పదవి ఇచ్చినందుకు కూడా ఎంతో సంతోషంగా ఉన్నామని రాయచోటి నియోజకవర్గం తప్పకుండా చంద్రబాబు నాయుడు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కృషితో రాయచోటి తప్పకుండా అభివృద్ధి చెందుతుందని, ప్రతి ఒక్కరి ప్రజల నోటి నుండి వస్తున్న, వినిపిస్తున్న మాట ఇదే అన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇంచార్జ్ మాజీ వీరభద్ర స్వామి కమిటీ చైర్మన్ ఎద్దుల లక్ష్మీప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయకులు సగీర్, ఆసిఫ్ రమణ పాల్గొన్నారు.

సూర్య వాస్తవం
Truth of News
http://www.suryavastavam.in


# అంతరాష్ట్ర సెల్ ఫోన్ దొంగ అరెస్ట్

## - లక్షల విలువగల సొత్తు స్వాధీనం
## - దొంగలించిన ఫోన్స్ కొనుగోలు చేసిన ఫారుక్ మొబైల్స్ యజమానిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



**అనంతపురం క్రైం -సూర్య వాస్తవం, జూలై 8:** ఇళ్లలోకి ప్రవేశించి బంగారు నగలు, సెల్ ఫోన్స్, ల్యాప్ టాప్ లు దొంగతనం చేసే అంతరాష్ట్ర దొంగ విక్కి అలియాస్ షామీర్ ను అనంతపురం పోలీసులు మంగళవారం నాడు అరెస్టు చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు. అతను దొంగలించిన సెల్ ఫోన్స్ ను కొనుగోలు చేసిన కమల నగర్ లోని ఫరూఖ్ మొబైల్ షాప్ యజమాని ఫరూఖ్ ఖాన్ లు అరెస్ట్ వారి నుంచి 6 తులాల బంగారు గాజులు, 12 సెల్ ఫోన్స్, రెండు ల్యాప్ టాప్ లు మరియు ఒక స్కూటీను రికవరీ చేశామని తెలిపారు.

**దొంగ సొత్తు విలువ సుమారు 12 లక్షలు:** అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీశ్ ఆదేశాల మేరకు అనంతపురం అర్బన్ డి.ఎస్.పి వి.శ్రీనివాస్ ఆధ్వర్యములో అనంతపురం సిసి ఎస్ పోలీస్ స్టేషన్ సిఐలు వలి భాష, జయాపాల్ రెడ్డి, అనంతపురం 2 టౌన్ సిఐ శ్రీకాంత్, యస్. ఐ రుషేంద్ర బాబులు టీంగా ఏర్పడి అనంతపురం 2 టౌన్ అనంతపురం 1 టౌన్ పరిది లలో, గోవాలో కూడా దొంగతనాలు చేసిన మాదిరికర్రి విక్కీ అలియాస్ షామీర్ ను అరెస్టు చేశారు. గుజరాత్ రాష్ట్రానికి చెందిన షమీర్ అను అతను 6 సం,,రాల వయస్సు లోనే గుజరాత్ నుంచి పారిపోయి వచ్చి విజయనగర్ కాలనీ, అనంత పురము టౌన్‌లో అనాథ శరణాలయంలో వుంటూ రాజేంద్ర మున్సిపల్ స్కూల్‌లో 9వ తరగతి వరకు చదివి చిల్లర దొంగ తనాలు చేస్తూ చేస్తూ రాత్రి సమయాలలో ఇళ్ళలోకి వెల్లి దొంగతనాలు చేస్తూ వుండే ఇతన్ని అరెస్ట్ చేసామని తెలిపారు. ఈ క్రమంలో ఇతను అనంతపురం 2 టౌన్ పరిదిలో 2024 వ సంవత్సరం, నవంబర్ నెలలో విద్యుత్ నగర్ సర్కిల్‌లో గల ఇంటిలోకి వారం వ్యవధిలో రెండు సార్లు ప్రవేశించి 2 బంగారు గాజులు కొంత నగదు దొంగలించుకొని వెళ్ళినాడు అందులో ముద్దాయి నుంచి 2 బంగారు గాజులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.అదేవిధంగా అనంతపురం 1 టౌన్ పరిదిలో జూన్ నెలలో యమహా పసినో స్కూటీ ను దొంగలించాడని సదరు స్కూటీ ను కూడా అతని నుంచి స్వాధీన పరుచుకున్నామనీ అదేవిధంగా జూన్ నెలలోనే గోవా లో ఐ ఫోన్ మరియు ఆపిల్ ల్యాప్ ట్యాప్ ను దొంగలించినాడు వాటిని అతని నుంచి రికవరీ చేశామన్నారు.ఇవే కాకుండా వీటితో పాటు విక్కి అలియాస్ శామీర్ ముద్దాయి నుంచి 8 సెల్ ఫోన్స్ రెండు ల్యాప్ ట్యాప్ లు రికవరీ చేశామని తెలిపారు.అదేవిధంగా విక్కి దొంగతనం చేసిన 4 సెల్ ఫోన్స్ లను కొనుగోలు చేసిన ఫరూఖ్ నుంచి కూడా 04 సెల్ ఫోన్స్ రికవరీ చేశామన్నారు.రికవరీ చేసిన దొంగ సొత్తు విలువ సుమారు 12 లక్షలు రూపాయలు ఉంటుందన్నారు. అనంతపురం 2 టౌన్ ఇన్స్పెక్టర్, ఎస్సై, సిబ్బంది మంగళవారం నాడు మధ్యాహ్నం ప్రసన్నాయ పల్లి రైల్వే గేటు వద్ద సదరు ముద్దాయి శామీర్ , ఫరూఖ్ ను అరెస్ట్ చేసి నుంచి 6 తులాల బంగారు గాజులు, 12 సెల్ ఫోన్స్, రెండు ల్యాప్ టాప్ లు ,ఒక స్కూటీ (వాటి విలువ 12 లక్షలు ) రికవరీ చేశామని మీడియాకు తెలిపారు.

**ప్రశంస:-** ముదాయిని అరెస్ట్ చేయడంలో కీలక పాత్ర పోషించిన సి సి ఎస్ పోలీస్ స్టేషన్ సి ఐ వలి భాష , సి ఐ జయపాల్ రెడ్డి అనంతపురం 2 టౌన్ సి ఐ శ్రీకాంత్ , ఎస్ ఐ ఋషేంద్ర బాబు, సిసిఎస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున, పోలీస్ కానిస్టేబుల్ బాలకృష్ణ, అనంతపురం 2 టౌన్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్స్ రాజశేఖర్ అమర్, జి.సుధాకర్ , రామాంజినేయులు, విజయ్ కుమార్ వన్నురప్ప లను జిల్లా ఎస్పీ పి. జగదీశ్ అభినందించారు.

# ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించండి

- ఉపాధి శ్రామికులకు 100 రోజుల పనిదినాలు కల్పించండి
- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



**రాయచోటి-సూర్య వాస్తవం,జూలై 08:** గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కల పెంపకాన్ని విస్తృతంగా చేపట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం వీరబల్లి మండలం పొంగిమళ్ళ గ్రామపంచాయతీ పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద పండ్ల మొక్కలను నాటే కార్యక్రమం లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ పథకం కింద ఆర్. చంద్రశేఖర్ రెడ్డి రైతు పొలంలో కలెక్టర్ నిమ్మ చెట్లు నాటి రైతులను, ఉపాధి శ్రామికులను ప్రోత్సహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కల పెంపకాన్ని చేపట్టడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు, గ్రామీణులకు ఉపాధి లభిస్తోందన్నారు. ఉపాధి హామీ పథకం కింద రైతుల పొలాల గట్లతో పాటు ఖాళీగా ఉండే ప్రదేశాలలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి ఉపాధి శ్రామికులకు వంద రోజుల పని దినాలు కల్పించాలని కలెక్టర్ డ్వామా అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 5 వేల ఎకరాల్లో మొక్కలు నాటాలన్న లక్ష్యంలో భాగంగా మంగళవారం రోజున 1500 ఎకరాల్లో ఉపాధి శ్రామికులచే మొక్కలు నాటించడం జరిగిందని తెలిపారు. ఈ పథకం ద్వారా మామిడి, జీడి మామిడి, నిమ్మ, బత్తాయి, జామ, తైవాన్ జామ, కొబ్బరి, సపోటా, చింత నేరేడు, అంజీరా, అవకాడో, గులాబీ, మల్లె తదితర మొత్తం 20 రకాల పూలు మరియు పండ్ల మొక్కలను ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్న కాలు రైతుల పొలాల్లో నాటేందుకు ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం కల్పిస్తున్నదన్నారు. ఈ అవకాశాన్ని ఉపాధి శ్రామికులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పండ్ల, పూల తోటలను పెంచుకోవడం వలన రైతులకు అభివృద్ధి చెందుతారని, రైతుకు నికర ఆదాయం వచ్చే అవకాశాలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. మామిడి ఒకటే కాకుండా వివిధ రకాల పండ్ల మొక్కలను రైతులు పెంచుకునే విధంగా రైతులను ప్రోత్స హించాలని అధికారులను ఆదేశించారు. జాబ్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పథకం కింద 100 రోజుల పని దినాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి, ఏపీడి, తాసిల్దార్, ఎంపీడీవో, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం రైతులకు ఒక వరం



**రాప్తాడు -సూర్య వాస్తవం,జూలై 08:**

ఉపాధి హామీ పథకం అంటే కేవలం కూలీ పనులకు వెళ్లడం మాత్రమే కాదని అందులో చాలా రకాలు ఉన్నాయని వాటన్నింటినీ రైతులు సద్వినియోగం చేసు కోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు.ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రామగిరి మండలం చెర్లోపల్లి గ్రామంలో కోడూరు రైతు రాకేష్ కు చెందిన 4 ఎకరాల పొలంలో 280 చెట్లు నాటారు.ఈ సంధర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం రైతులకు ఒక వరం లాంటిదన్నారు.గత ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకం కింద ఏవైనా పనులు ఇవ్వాలంటే టిడిపి వారా?వైసిపి వారా? అని చూసారని విమర్శలు చేశారు.కానీ మన ప్రభుత్వం పార్టీలు చూడకుండా రైతులకు పథకాలు ఇస్తోందన్నారు.

ప్రస్తుతం రామగిరి చెన్నేకొత్తపల్లి కనగానపల్లి మండలాల్లో 900 ఎకరాల్లో అనంతపురం రూరల్ ఆత్మకూరు రాప్తాడు మండలాల్లో 850ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం మంజూరైందన్నారు.ఒక్కో మొక్క రూ.64 చొప్పున రవాణా ఖర్చులతో సహా ప్రభుత్వం భరిస్తుందన్నారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రస్తుతం మామిడి చీనీ వంటి మొక్కలను ప్రభు త్వం అందిస్తోంది. రైతులు ఈ మొక్కలు కాకుండా మరేవైనా ఎక్కువ ధరకు వెచ్చించైనా కొనుగోలు చేసి వాటిని నాటు కోవాలన్నారు.ఈ మొక్కలను సొంత బిడ్డల్లా పెంచితే అవి రేపు మిమ్మల్ని పోషిస్తాయన్నారు.



## ఘనంగా డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 76 వ జన్మదిన వేడుకలు



**పత్తికొండ టౌన్-సూర్య వాస్తవం, జూలై 8:** పత్తికొండ పట్టణంలో స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి 76వ జన్మదిన వేడుకలు పోచిమిరెడ్డి సేవాదళ్ స్వచ్ఛం ద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘన ంగా నిర్వహించారు. స్థానిక చక్రాల రోడ్డులోని వైయస్సార్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోచిమిరెడ్డి భార్గవిరెడ్డి, పోచిమి రెడ్డి జాహ్నవిరెడ్డి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జన్మదిన కేక్ కట్ చేసి పంచిపెట్టి, భోజనం కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ మాజీ ఉపసర్పంచ్ కె .కోటేశ్వరరావు, కె.గోవిందరాజు, వార్డు మెంబర్ లైట్ నాగరాజు, బోడ శ్రీను, సాబ్దిన్ నూర్ భాషా, చక్రాల లక్ష్మీకాంత రెడ్డి, విరుపాక్ష రెడ్డి, మాల మునిస్వామి, ఎరుకల అశోక్, షాహిద్, పోచిమి రెడ్డి సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలపై అవగాహన సదస్సు



**గుత్తి-సూర్య వాస్తవం,జులై 8:** గుత్తి మండలంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చె ట్నేపల్లిలో ఆశా డేలో గర్భస్థ పిండలింగ నిర్ధారణ నివార ణ చట్టం1994 బాల్య వివాహాలు గురించి డాక్టర్ అమ ర్నాథ్ వైద్యాధికారి వివరించ డం జరిగినది,డాక్టర్ అమ ర్నాథ్ వైద్యాధికారి మాట్లా డుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నివారణ చట్టం 19 94 అమలు కావాలంటే ప్రజ లు గ్రామ సంఘాలు ప్రతి డి పార్ట్మెంట్ కలిసి పనిచేయా లని అన్నారు ఆడ మగ స మానమని ఆడ బిడ్డపై చిన్న చూపు చూడరాదని అదే వి ధంగా స్త్రీలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు అని చెప్పారు బాల్య వివాహాలు కూడా సమాజానికి అవరోధాలు అని ఇలా చేయటం వలన ఆడపిల్లలు కోరుకున్న కలలు తీరవు వారు ఒకరు కింద ఆధీనంలో ఉండాలని చిన్న వయసులోనే పెళ్లి చే సుకోనడం వలన ఆరోగ్య స మస్యలు మాతృ మరణాలు శిశు మరణాలు కూడా సంభ విస్తాయని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సి,వెంకటేష్ హెచ్ఇఓ,గంగాదేవి హెచ్ ఎ స్,ఏఎన్ఎంలు,ఆశావర్క లు పాల్గొన్నారు

## పండ్ల తోటలలో మొక్కలు పెంచు కార్యక్రమం



**గుత్తి -సూర్యవాస్తవం, జులై 8:** గుత్తి మండలం కరిటికొండ గ్రామంలో మహాత్మా గాంధీ జా తీయ గ్రామీణ ఉపాధి పథకంలో పండ్ల తోటలలో మొక్కలు పెంచు కార్యక్రమం నిర్వహించినారు.ఈ కార్యక్రమం లో అనంతపూర్ పార్ల మెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ,తెలుగుదేశం పార్టీ అనం తపురం జిల్లా అధ్యక్షులు,ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ చై ర్మన్ వెంకట శివుడు యాదవ్, గుంతకల్ నియోజకవర్గం గుత్తి, పామిడి మండలాల ఇన్చార్జి గు మ్మనూరు ఈశ్వర్ వ్యవసాయ హార్టికల్చర్ అధికారులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దం పూరి బోలికొండ రంగరాజు భార తీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొనడం జరిగింది.

# ప్రతి అడుగు ప్రగతి కోసం..
# ప్రతి పథకం పేదల అభ్యున్నతికే...

- సుపరిపాలనలో తొలి అడుగు
- సుపరి పాలనతోటే ఇంటింటికి వెలుగు
- బీసీ వెల్ఫేర్ చేనేతజౌళి శాఖ మంత్రి సంజీవరెడ్డి సవితమ్మ





**చెన్నూరు-సూర్య వాస్తవం జూలై 8:** ప్రతి అడుగు ప్రగతి పథం వైపు దూసుకెళుతూ, ప్రతి పథకం పేద వారి ఇంటిలో వెలుగు నింపడమే ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశమని ఆదిశగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని, సుపరిపాలనలో ఇది తొలి అడుగు మాత్రమేనని బీసీ వెల్ఫేర్ చేనేత జౌళిశాఖ మంత్రి( జిల్లా ఇన్చార్జి మంత్రి) సంజీవరెడ్డి గారి సవితమ్మ అన్నారు. మంగళవారం ఉదయం చెన్నూరు బెస్త కాలనీ నందు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి తో కలిసి ఆమె పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో ఇంటింటి వెళ్లి మహిళలను పలకరించి కూటమి ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు .ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయా సమస్యలు ఉంటే తమకు చెప్పాలని ఆమె గ్రామస్తులను అడగడం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబ ునాయుడు ఒక విజన్ కలిగిన నాయకుడని ఆయన రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడుతున్నారని ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఆమె అన్నారు. ఇది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వాన్ని ఆమె తెలిపారు. గత ప్రభుత్వంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి. ఎంతమంది పిల్లలు పాఠశాలకు వెళితే అంతమందికి అమ్మ ఒడి ఇస్తానని చెప్పి, అధికారంలోకి రాగానే ఒకరికి అమ్మ ఒడి అని చెప్పడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఆయన పాలనలో అంత రంగులు వేయడానికే సరిపోయిందని పిల్లల పుస్తకాలకు బ్యాగులకు, సచివాలయాలకు ప్రతి విషయంలో ఆయన రంగులు వేయడానికి కాలం వెల్లబుచ్చడం జరిగిందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు నాణ్యమైన పుస్తకాలు బ్యాగులు సరఫరా చేయడం జరిగిందని వాటన్నిటి పైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిమ ఉండే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జగన్మోహన్ రెడ్డి పర్యటన అంటే పరదాలు కట్టడానికి చెట్లు నరకడానికి తప్ప ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని ఆమె తెలిపారు. ఆయన ప్రభుత్వంలో వికలాంగులకు వృద్ధులకు 2000 పెన్షన్ నుండి 3000 వరకు పెన్షన్ పెంచాలంటే ఐదు సంవత్సరాల కాలం పట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే మూడు వేల నుండి నాలుగు వేల వరకు పెన్షన్ పెంచడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఇంట్లో ఎంతమంది పిల్లలు బడికి వెళితే అంతమంది పిల్లలకు 15వేల రూపాయలు చొప్పున తల్లికి వందనం పథకం ద్వారా అందించిన ఘనత నారా చంద్రబాబు నాయుడుకే తగ్గింది అన్నారు. అలాగే సార్వత్రిక ఎన్నికలలో సూపర్ సిక్స్ పథకం కింద ఏవైతే ప్రజలకు హామీ ఇచ్చారో వాటన్నిటిని కూడా మొదటి సంవత్సరంలోనే ఈ 80శాతం పూర్తి చేసిన ఘనత నారా చంద్రబాబు నాయుడు ఇదేనని ఆమె అన్నారు, అమ్మ ఒడి పథకం ద్వారా విద్యార్థులకు 15వేల రూపాయలు చొప్పున ఇవ్వడమే కాకుండా మహిళలకు దీపం పథకం ద్వారా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం జరిగింది. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వడం జరిగిందన్నారు. రైతులకు సబ్సిడీతో కూడిన యంత్రాలు పనిముట్లు, ఇవ్వడమే కాకుండా నాణ్యమైన విత్తనాలు పురుగు మందులు కూడా సరఫరా చేయడం జరిగిందన్నారు. ప్రతి పేదవాడికిఐదు రూపాయలతోనే అన్న క్యాంటీన్ ల ద్వారా ఆకలి తీర్చిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది తెలుగుదేశం ప్రభుత్వ మేనన్నారు. ఇలా సంక్షేమ పథకాలే కాకుండా గ్రామాలలో అభివృద్ధి చేపట్టడం జరిగిందన్నారు ఎన్ ఆర్ జిఎస్ కింద ఇప్పటికే గ్రామాలలో సిసి రోడ్లు, డ్రైనేజీలు చేపట్టడం జరిగిందన్నారు. ఇంకా ఏవైనా ప్రజలకు మౌలిక వసతులు కావాలంటే ఏర్పాటు చేసే దానికి ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆమె తెలియజేశారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి తన కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం జరుగుతుందని, ఇప్పటికే పోలీసులను గుడ్డలు ఊడదీసి తన్నుతామని జాతరలో పొట్టేళ్లను నరికినట్లు రప్పా రప్పా నరుకుతామని అంటూ రెచ్చగొట్టిన మేము రెచ్చిపోమని మేము అభివృద్ధి పథంలో, సంక్షేమ పథంలో రెచ్చిపోతామే తప్ప నీల పనికిమాలిన గాలి మాటలకు రిచిపోమని ఆమె జగన్మోహన్ రెడ్డికి హితవు పలికారు.

కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి తనకు సోదర సమానులని ఆయన మహానాడు కార్యక్రమాన్ని కడప బొడ్డు నిర్వహించిన తీరు అద్భుతమని చిన్న వయసులోనే పెద్ద బాధ్యతను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని ఆమె కృష్ణ చైతన్య రెడ్డి పై ప్రశంసల వర్షం కురిపించారు. కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి మాట్లాడుతూ, సుపరిపాలనకు తొలి అడుగు ఈ సంవత్సరం కాలంలో మేమేమైనా తప్పటడుగు వేసామా లేదా సరైన మార్గంలో వెళ్ళామా లేదా అని ఎందుకు ప్రజల వద్దకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి గడపగడపకు వెళ్లడం జరిగిందన్నారు. మేము వెళ్లిన ప్రతిచోట ప్రజలు బ్రహ్మరథం పట్టారని మేము వేసిన అడుగు సరైనదని ఈ సంవత్సర కాలంలో ప్రజలకు ప్రభుత్వం ద్వారా 80% ఇచ్చిన హామీలను నెరవేర్చడం జరిగిందని ఇంకా నాలుగు సంవత్సరాల కాలం ఉన్నదని ప్రజలకు ఇంకా మెరుగైన పాలనను అందించడంలో ఎలాంటి సందేహం లేదని ఆయన అన్నారు. అంతేకాకుండా అక్కడి ప్రజలు అడిగిన పనులపై ఆయన స్పందిస్తూ, చెన్నూరు కొత్త రోడ్డు పైన బస్ షెల్టర్ అలాగే డ్రైనేజీ పనులు, సర్వీస్ రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు వంటి మౌలిక వసతులు కూడా వీలైనంత త్వరగా పరిష్కరించడం జరుగుతుందని ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటన్నిటిని నెరవేర్చే విధంగా కృషి చేస్తానని వారు గ్రామస్తులకు హామీ ఇవ్వడం జరిగింది. నేను ఎమ్మెల్యేగా ప్రమాణం చేసిన నా తొలి ప్రయత్నం చెన్నూరు మండలానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని ఇక్కడి ప్రజలు నన్ను నమ్మి నాకు మంచి మెజారిటీ ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు. అలాంటి ప్రజలకు సేవ చేసే భాగ్యం నాకు కలిగినందుకు నాకు చాలా ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నారని ముఖ్యంగా నారా లోకేష్ కొప్పర్తిలో ఇన్ఫో స్ట్రక్చర్ డెవలప్ చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారని, జిల్లాకు ఉక్కు పరిశ్రమ తీసుకురావడం జరుగుతుందని ఆయన తెలిపారు. చెన్నూరు గ్రామ ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఇస్తే వాటన్నిటిని పరిశీలించి నెరవేర్చడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్య క్రమంలో జిల్లా కో-ఆపరేటివ్ అధికారి వెంకటసుబ్బయ్య, టిడిపి నాయకులు కల్లూరు విజయభాస్కర్ రెడ్డి, ఇంది రెడ్డి శివారెడ్డి, రామన శ్రీలక్ష్మి, తాడిగొట్ల వెంకటసుబ్బారెడ్డి (బుజ్జన్న), గుమ్మల్ల మల్లికార్జునరెడ్డి, పొట్టి పాటి హనుమాన్ రెడ్డి , పొట్టి పాటి జగదీశ్వర్ రెడ్డి, సీతమ్మ గారి శ్రీకాంత్ రెడ్డి, ఆకుల బాబు, ఆకుల చలపతి , ముండ్ల శ్రీనివాసులు రెడ్డి, షబ్బీర్, కుంచం రామకృష్ణారెడ్డి , ఆవుల బసిరెడ్డి, ఆవుల పవన్ కుమార్ రెడ్డి, పాలగిరి పెద్ద సుబ్బారెడ్డి, పాలగిరి సుదర్శన్ రెడ్డి, వేల్పుల సుబ్రహ్మణ్యం, యామాల మణికంఠ, తాసిల్దార్ సరస్వతి, ఎంపీడీవో కిరణ్ మోహన్ రావు, అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పొగాకు ఉత్పత్తులపై
## పోలీసుల ప్రత్యేక డ్రైవ్






**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 8:** జిల్లా వ్యాప్తంగా పోలీసులు మంగళవారం నాడు విద్యాసంస్థలకు సమీపంలో ఉన్న వ్యాపార సముదాయాలు, బడ్డీలు, దుకాణాలు, టీ కేఫ్ లు, తదితరాలలో నిషేధిత పొగాకు ఉత్పత్తుల కట్టడిలో భాగంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ముఖ్యంగా గంజాయితో తయారు చేసి అక్రమంగా విక్రయించే చాక్లెట్లు, చుట్టలుపై నిఘా వేసి లోతుగా చెక్ చేశారు. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని 2003 పొగాకు నియంత్రణ చట్టం నిబంధనల మేరకు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యా సంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయించడం లేదు అనే బోర్డులు ఏర్పాటు చేయాలని వ్యాపారులకు సూచించారు.

## సచివాలయంలో పాలనాపరమైన విధులలో నిమగ్నమైన మంత్రి



**రాయచోటి/అమరావతి-సూర్య వాస్తవం, జులై 8:** రాష్ట్ర రాజధాని అమరావతి సచివాలయంలో మంగళవా రం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తన చాంబర్లో శాఖలపై వచ్చిన కీలక ఫైళ్లను పరిశీలిస్తూ, పాలనాపరమైన విధులను నిర్వర్తించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు ఇచ్చారు. ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాలు అమలవుతున్న పథకాలు, మెజార్టీ ప్రజలు సంతృప్తి ఉండేలాగా ఆయన పాలనాపురం లో విధులలో నిమగ్నమై పోయారని టిడిపి ముఖ్య నేత సమాచారం. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజలు గమనిస్తున్న సేవల గురించి పలువు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని
## మంత్రి సవితమ్మకు వినతి



**చెన్నూరు -సూర్య వాస్తవం ,జూలై 8:** చేనేత కార్మికులు పడుతున్న కష్టాలను, ఇబ్బందులను వారి సమస్యలు పరిష్కరించాలని తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రహ్మణ్యం చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మకు విన్నవించుకుని వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మంగళవారం రామనపల్లి చేనేత కార్మికులతో కలిసి మంత్రి సవితమ్మకు తమ సమస్యలను చెప్పుకోవడం జరిగిందని విలేకరులకు తెలిపారు. చేనేత కార్మికులకు ఉచితంగా ఇల్లు వర్క్ షెడ్ నిర్మించి ఇవ్వాలని కోరడం జరిగిందని అదేవిధంగా, చేనేత కార్మికులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని తద్వారా పూర్తి ఉచిత వైద్యం ప్రభుత్వమే అందించాలని కోరడం జరిగిందని తెలిపారు. అలాగే ప్రతి చేనేత కార్మికుడికి జీవిత బీమా అందించి ప్రమాదవశాత్తు సంఘటన జరిగితే ప్రభుత్వమే ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరడం జరిగిందని. రాష్ట్రంలోని ప్రతి చేనేత కార్మికుడికి 30 వేల రూపాయలు ప్రతి ఏటా ఆర్థిక చేయూతని కల్పించాలని కోరామని ఆయన తెలిపారు. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి చేనేత కార్మికులకు వెంటనే చేనేత గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని మంత్రి కి విన్నవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చేనేత సంఘాల నాయకులు, బడిగింజల మురళి , గుగ్గిళ్ళ చాణుక్య ,సుబ్బారావు, బొమ్మన శ్రీకాంత్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించండి

- వీరబల్లి తహాశీల్దార్‌కు తెలిపిన జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



**రాయచోటి టౌన్, సూర్య వాస్తవం , జూలై08:** వీరబల్లిలోని కస్తూర్బా గురుకుల బాలికల పాఠశాల, అదేవిధంగా పక్కనే ఉన్న స్థలం ఇదంతా ప్రభుత్వ భూమి అని పదేపదే ఆ భూమిపై ఫిర్యాదులు చేయరాదని అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. మంగళవారం ఆయన సమస్యాత్మకంగా ఉన్న ఆ స్థలాన్ని పరిశీలించారు. అంతేకాకుండా చుట్టుపక్కల ఉన్న స్థలాన్ని కూడా పరిశీలించి సర్వే చేయించి నివేదికలో తమకు పంపాలని వీరబల్లి తహాశీల్దార్‌కు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ స్థలంలో వేసిన పునాదిని తొలగించాలని అధికారులకు తెలిపారు. అంతేకాకుండాప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన నాణ్యమైన పరిష్కార మార్గాలు చూపాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవిన్యూ అధికారులను ఆదేశించారు. వీరబల్లి మండలం, వీరబల్లి గ్రామ పరిధిలో హరిజనవాడకు చెందిన వందాడి ప్రభాకర్ వివిధ రకాల సర్వేనెంబర్లలో తనకు చెందిన భూములను థర్డ్ పార్టీ వ్యక్తులు చుక్కల భూములకింద చూపించి ఇంటి స్థలాల ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారని సంభందిత భూములపై కూడా విచారణ జరిపి న్యాయం చేయవలసిందిగా కలెక్టర్ వారిని కోరిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించి సంబంధిత అర్జీ దారులతో మాట్లాడారు. ఈ విషయమై అర్జీ దారులు ఈ భూమి తనకు చెందినదని తన పూర్వీకుల నుండి ఈ భూమిలో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నామని, అంతేకాకుండా ప్రభుత్వానికి అవసరం నిమిత్తం ప్రభుత్వ భవనాలకు ఐదు ఎకరాలు ఇవ్వడం జరిగిందని సంబంధిత రైతులు కలెక్టర్ కు విన్నవించారు.

సదరు భూములు ప్రభుత్వ రికార్డులలో ఆర్ హెచ్ ( రికార్డ్ హెూల్డింగ్) నందు ఆయకట్టు బంజర భూమిగా ఉన్నదని, ఇది ప్రభుత్వ భూములని కలెక్టర్ తెలిపారు. భూములకు సంబంధించి హక్కుదారుల దగ్గర ఉన్న రికార్డులను, ఆధార్ కార్డును సంబంధిత తాసిల్దార్ కార్యాలయంలో ఇచ్చినట్లయితే 5 కిలోమీటర్లు అవతల ఎక్కడైనా ప్రభుత్వ భూమి ఉన్నట్లయితే అర్హులైన వారికి ఇవ్వడం జరుగుతుందని ఐదు కిలోమీటర్ల లోపల ప్రభుత్వ భూమి ఎవరికి ఇచ్చేదానికి కుదరదని కలెక్టర్ ఈ సందర్భంగా వారికి తెలిపారు.అలాగే రెవెన్యూ ఆధీనంలో ఉన్న భూములన్నిటికీ రక్షణ కల్పించాలని తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఖాజాబీ, టిప్యూటీ తాసిల్దార్, వీఆర్వో పాల్గొన్నారు.

## రెడ్ బుక్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టాలి
## అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయాలి

-మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



**నాయుడుపేట- సూర్య వాస్తవం , జూలై 08:** కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి, అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు.మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా నాయుడుపేట పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య క్యాంపు కార్యాలయంలో వైయస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలు వేసే నివాళులు అర్పించి,బారీ కట్ చేసి పంచిపెట్టారు. అనేక అభివృద్ధి,సంక్షేమ పథకాలు అమలు చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక,వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి,మాజీ ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, వైసీపీ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి,వైసీపీ నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి,వైసీపీ నాయుడుపేట మండల అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్,మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, వైసీపీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఈదా రత్న శ్రీ, మున్సిపల్ కౌన్సిలర్లు పాపారెడ్డి చంద్రారెడ్డి,షేక్ షబ్బీర్,దారా రవి,పాలేటి నాగార్జున,రాయపు సరిత,కావేరిపాకం అశోక్ కుమార్,మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు చదలవాడ కుమార్,కె భావన్,వైసీపీ నాయకులు బైనా మల్లికార్జున్ రెడ్డి,పేట చంద్రారెడ్డి,మెస్ భాస్కర్ రెడ్డి,షేక్ రెహమతుల్లా, పేర్నాటి రాహుల్,సాదు మోహన్,షేక్ జిలాని,తిమ్మాజి కండ్రిగ సర్పంచ్ నల్లూరు ప్రకాష్,పుదూరు సర్పంచ్ పిల్లాసి మని,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం గేట్లు ఎత్తివేత...



**శ్రీశైలం -సూర్య వాస్తవం ,జూలై 8:**జురాల ప్రాజెక్టు నుంచి భారీగా వరద రావడంతో శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయిలో నిండిపోయింది. దీంతో అప్రమత్తం అయిన సీఎం చంద్రబాబు, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు జలశయం దగ్గరికి చేరుకుని కృష్ణ నదికి జలహారతి ఇచ్చారు.అనంతరం అధికారులు నాలుగు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో శ్రీశైలం జలాశం నుంచి వరద మెరుపు వేగంతో నాగార్జున సాగర్ పైపు పరుగులు తీస్తుంది.

# అడ్రస్ లేని వర్షాలు...

# అయోమయంలో రైతాంగం



**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, జూలై 8:** అనంతపురం : కార్తెలన్నీ పోయ, విత్తనాల ఏకాదశి పోయే, మే జూన్ నెలల్లో దుక్కులు దున్ని విత్తనం వేయడానికి సన్నద్ధం చేసి వర్షాల కోసం ఎదురు చూసే పరిస్థితి. తడి లేని పొలాలు, పచ్చగడ్డి లేని గట్టు, మేత లేక బక్కచిక్కిన పశువులు. అన్నీ చినుకు కోసం చూస్తున్నాయి! సాగునే నమ్ముకున్న రైతుల్లో తీవ్ర నిరాశ నిస్పృహలు మొదలైంది. వర్షం ఎప్పుడొస్తుందో అంచనా వేయలేక పోతున్నారు శాస్త్రజ్ఞులు. ఈ పాటికి డెబ్భై శాతం వేరుశెనగ విత్తనం వేయాల్సిన చేన్లు వర్షపు చినుకు కోసం పరితపిస్తున్నాయి. విత్తిన విత్తనాలు ఇంకా మొలకెత్తడం లేదని, అదును దాటిపోతోందనే భయం పట్టుకుంది. తొలకరిలోనే వరుణుడు మొహం చాటేశాడు. ఫలితంగా జిల్లాలో పంటల సాగు ఆశించినంత లేదు. జూన్ 1 నుంచి 30 మధ్య సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. జూన్ నెలలో 64 శాతం మేర 'వర్షపాత లోటు' నమోదైంది. జూన్ చివరి వారంలో చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 60 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. 23 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులున్నాయి. కేవలం 3 మండలాల్లోనే సాధారణ వర్షపాతం నమోదైంది ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మొత్తంగా నిరుడు నైరుతి ప్రవేశించినప్పటి నుంచి అంటే జూన్ 1 నుంచి అవి నిష్క్రమించే సెప్టెంబరు 30 వరకు జిల్లాలో అధికంగా వర్షం కురిసింది. ఈ ఏడాది జూన్ మాసంలో 44 శాతం లోటు వర్షపాతం నమోదైంది. నిరుడు రాష్ట్రవ్యాప్తంగా వర్షాకాలం ముగిసే నాటికి అధిక వర్షపాతం నమోదు అయింది.

కాగా ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు అంచనాలకు ఏమాత్రం అందడం లేదు. దేశంలోకి కాస్త ఆలస్యంగా ప్రవేశించాయి. వచ్చిన తర్వాత కూడా వేగంగా విస్తరించకుండా ఒకచోటే ఉండిపోయింది. పదిరోజుల పాటు వాటి కదిలికల్లో ఏమాత్రం మార్పు కనిపించలేదు. ఆ తర్వాత తిరిగి పుంజుకుని ఉత్తరాదికి వ్యాపించాయి. దీంతో మధ్య వాయువ్య భారతంలో కుంభవృష్టి వర్షాలు కురిశాయి. జూలై 8 నాటికి దేశంలోని వాయువ్య భారతానికి చేరుకోవాల్సి వుండగా ముందుగానే ఆ ప్రాంతాలకు విస్తరించాయి. అయితే ఉత్తరాది రాష్ట్రాలో కుంభవృష్టి వర్షాలు పడగా, దక్షిణాదిన మాత్రం వర్షం ఛాయలే కనిపించలేదు. ప్రస్తుతం రైతాంగమంతా జూలై మాసం పైనే ఆశలు పెట్టుకుంది. ఈ మాసంలోనైనా గట్టి వానలు పడితే పంటలపై ఆశలు చిగురిస్తాయి. జిల్లాలో ఇప్పటిదాకా వేరుశనగ, పత్తి, ధనియాలు, వరి, కంది, జొన్న, మొక్కజొన్న, పెసర, మినుము, నువ్వులు, పొద్దుతిరుగుడు, ఆముదం తదితర పంటల సాగు విస్తీర్ణం 10 శాతం కూడా దాటలేదు. సాధారణంగా సీజన్ ప్రారంభంలోనే (జూన్ మొదటి, రెండు వారాల్లోనే) వేరుశెనగ, పత్తి విత్తుతారు. కానీ, ఈసారి సీజన్ ప్రారంభంలో సమృద్ధిగా వర్షాలు పడకపోవడంతో వేరుశెనగ, పత్తి విత్తనాలు నాటేందుకు రైతులు మొగ్గు చూపలేదు. ఇప్పటిదాకా రాష్ట్రంలో కేవలం వందల ఎకరాల్లోనే వేరుశనగ, పత్తి విత్తనాలు నాటారు. మొక్కజొన్న పంట కూడా కేవలం మూడు వందల ఎకరాలు వేశారు. వానాకాలంలో కనీసం 7 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తారు. కానీ ఈసారి పరిస్థితులు తారుమారయ్యాయి. ఇతర పప్పు ధాన్యాలు, నూనె గింజల సాగు విస్తీర్ణం కూడా ఏమాత్రం ఆశాజనకంగా లేకపోవడం అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. వర్షాకాలంలో మైనస్ 28 శాతం వర్షపాతం లోటు నమోదైంది , సాధారణ వర్షపాతం 19 సెంటీమీటర్ల కు వ్యతిరేకంగా 13.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

సాధారణ వర్షపాతం 15 సెంటీమీటర్లు కాగా , మైనస్ 21.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని పేర్కొంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో రుతుపవనాలు చురుగ్గా ఉన్నప్పటికీ రాయలసీమ వ్యాప్తంగా వర్షాలు తక్కువగా ఉన్నాయి. విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం లేనందున దీని ప్రభావం తగ్గుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది .మరో ఐదు రోజుల్లో రాయలసీమలో అల్పపీడనం లేదని, దీంతో వర్షాలు తగ్గాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ , కోస్తాంధ్ర, రాయలసీమల్లో వర్షాలు తక్కువగా ఉన్నాయి. కోస్టల్ కర్ణాటక , కేరళలో పరిస్థితి భిన్నంగా ఉన్నాయి , ఇక్కడ ఎక్కువ వర్షాలు కురుస్తాయని, వారం రోజుల్లో రాయలసీమలో తెలంగాణ తుఫాను ఏర్పడుతుందని ఐఎండి శాస్త్రవేత్తలు. జూలై రెండో వారంలో పొడి వాతావరణం కొనసాగుతుండటంతో రాయలసీమ జిల్లాల రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఈసారి రుతుపవనాలు ముందుగా వచ్చినా లాభం లేదు అనంతపురం, సత్యసాయి జిల్లా, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, నంద్యాల, కర్నూల్ కొందరు రైతులువర్షాలపై ఆధారపడి తమ కార్యకలాపాలు ప్రారంభించాయి.

వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం ఉమ్మడి అనంతపురం జిల్లాలో 6.57 లక్షల ఎకరాల్లో వేరుశెనగ సాగు చేసేవారు కానీ ఇప్పటికి యాభై వేల ఎకరాలలో కూడా వేరుశెనగ విత్తనం వేయలేదు. జొన్న, సజ్జ, మొక్కజొన్న, పత్తి, శనగ, కంది వంటి ఇతర ప్రధాన పంటలకు ఇదే పరిస్థితి ఉంది , అయితే ఈ ఖరీఫ్ పంట సాధారణం కంటే తక్కువగా ఉంది.....డా. యం సురేష్ బాబు, అధ్యక్షుడు, ప్రజాసైన్స్ వేదిక

# ఘనంగా 76వ

# వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు

- అపర భగీరథుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి.
- ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వైయస్సార్..
- నాయుడుపేటలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ..!



**నాయుడుపేట– సూర్య వాస్తవం , జులై 08:** తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలో మంగళవారం దివంగత మహానేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి 76వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయుడుపేట పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టడం జరిగింది. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొద్దిసేపు పోలీసులకు మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య మాట్లాడుతూ ఇక్కడ అన్నదాన కార్యక్రమం, కేకును కట్ చేస్తే ట్రాఫిక్ కు అంతరాయం కలుగుతుందని పైనున్న ఉన్నతాధికారులు తెలియజేశారని పోలీసులు వైసిపి నాయకులకు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య మాట్లాడుతూ 6 సంవత్సరాల ముఖ్యమంత్రిగా ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి. రాష్ట్ర ప్రజలకు ఎన్నో అభివృద్ధి,సంక్షేమ పథకాలను అమలు చేసిన ప్రజల గుండెలో చిరస్థాయిగా నిలిచిపోయిన ఏకైక నాయకుడని అన్నారు. అలాగే దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి. ఆశయాలను తగ్గట్టుగా తండ్రికి తగ్గ తనయుడుగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి. ప్రజలకు మంచి జరిగే విధంగా ముందుకు వెళ్తున్నారని తెలిపారు..వైఎస్ఆర్ జయంతి వేడుకలు 9గంటలకి అయినప్పటికీ, వైఎస్ఆర్ విగ్రహం వద్దకు పోలీసులు 8గంటలకే చేరుకొని వైయస్సార్ సిపి నాయకులను, ప్రజలను పంపించివేయడం చాలా దారుణం అన్నారు. అంతేకాకుండా సూపర్ సిక్స్ పథకాలు 90%శాతం ప్రజలకు అందజేశామని మాటలు చెప్పుకోవడం కూటమీ ప్రభుత్వానికి చాలా సిగ్గుచేటు అని దుయ్యబట్టారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఇసుక,మట్టి,గ్రావెల్ దొంగతనాలు జరుగుతుంటే పోలీసులు అలాంటివి పట్టించుకోకుండా వైయస్సార్ జయంతి నాడు కేకును కట్ చేయనీకుండా ఇక్కడ పాక వేయడం ఇదేమి పద్ధతి కాదని అన్నారు. సీఎం చంద్రబాబు,లోకేష్ బాబు రెడ్ బుక్ రాజ్యాంగం పక్కనపెట్టి. అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేస్తేలన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలపై రాష్ట్ర ప్రజలు ఎలా విరుచు కుపడతారో చూడాలన్నారు. అంతేకాకుండా తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో తల్లికి వందనం రూ.15వేలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు తల్లికి వందనం పేరుతో రూ.13వేలు ఇచ్చి ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు..కొవ్వూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి. 5సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని ఒకసారి మంత్రిగా చేశారని ఆయన నివాసంలో దౌర్జన్యం చేస్తుంటే పోలీసులు చేతకాని వారిలా చేతులు కట్టుకొని మరి చూస్తున్నార న్నారు....అనంతరం వైఎస్ఆర్ విగ్రహం వద్ద ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది...ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, మండల అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్, మాజీ ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కామిరెడ్డి రాజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, నాగిరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, రాష్ట్ర కల్చరల్ సెక్రెటరీ కటకం జయ రామయ్య, పేట చంద్రారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు ఈదా రత్న శ్రీ, మున్సిపల్ కౌన్సిలర్లు పాపారెడ్డి చంద్రారెడ్డి, షబ్బీర్ బాషా, దారా రవి,రాయపు సరిత, కావేరిపాకం అశోక్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు చదలవాడ కుమార్, కాలాస్త్రి భావన్, సయ్యద్ ఇస్మాయిల్. మెస్ భాస్కర్ రెడ్డి, షేక్ రెహమతుల్లా, సాదు మోహన్, పుదురు సర్పంచ్ పిల్లాసి మని,తదితరులు పాల్గొన్నారు..



# అద్దంకి ఆర్టీసీ డిపోలో

# అందుబాటులోకి 5నూతన బస్సులు

- నూతన సర్వీసులను ప్రారంభించిన
- రాష్ట్ర రవాణా, శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**రాయచోటి/అద్దంకి–సూర్య వాస్తవం, జులై 8:** బాపట్ల జిల్లా, అద్దంకి ఆర్టీసీ బస్సు డిపోలో మంగళవారం రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి 3 సూపర్ లగ్జరీ, 2 ఎక్స్ప్రెస్ నూతన బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కొత్త బస్సులను ప్రవేశపెడు తోందని, త్వరలో ఉచిత ప్రయాణ పథకాన్ని మరింత సమర్థ వంతంగా అమలు చేయడా నికి చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారు లు, ఆర్టీసీ సిబ్బంది ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకంలో

# పండ్ల తోటల సాగుతో ఆర్థికాభివృద్ధి



**నాయుడుపేట– సూర్య వాస్తవం , జులై 08:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకం చేపట్టి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలని నాయుడుపేట ఎంపీడీవో కే సురేష్ బాబు అన్నారు. మంగళవారం నాయుడుపేట మండలంలోని వెంగమాంబ పురం గ్రామంలో ఏపీ ఓ ఆధ్వర్యంలో రైతు సుంకర విజయకుమార్ పొలాల్లోమహాత్మా గాంధీ జాతీయ గ్రామీ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకంలో భాగంగా ఎంపీడీవో కె.సురేష్ బాబు, నాయుడుపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి చిట్టేటి చెంచయ్య లు నిమ్మ మొక్కలు నాటారు. సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. పండ్ల తోటల సాగుతో తక్కువ పెట్టుబడితో రైతులు అధిక లాభాలు పొందవచ్చున్నారు. పండ్ల తోటల సాగుతోపాటు కూరగాయాలు, మినుము, పెసర వంటి అంతర పంటలను సాగుచేసుకుని అదనపు ఆదాయాన్ని పొంద వచ్చునన్నారు. వాతావరణం సమతుల్యత, ఆహ్లాదకర పరిసరాలను నెలకొల్పడంలో మొక్కల పెంపకం ప్రధాన భూమిక వహిస్తుందన్నారు. రైతుల ఆదాయం పెంచేందుకు పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ బాట

# బాలల బంగారు భవితకు పూదోట

- ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి



**కొత్తచెరువు – సూర్య వాస్తవం, జూలై 8:** అంగన్వాడీ బాట.. చిన్నారుల భవితకు పూదోటగా ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి అన్నారు. పుట్టపర్తి ప్రాజెక్ట్ పరిధిలోని కొత్తచెరువులో మంగళవారం ఏర్పాటు చేసిన అంగన్వాడీ బాట మండల స్థాయి కార్యక్రమానికి పీడీ శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడేళ్ల వయస్సు నిండిన పిల్లలను అంగన్వాడీలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్య లభిస్తుందని తెలిపారు. ఎటువంటి ఒత్తిడి లేని విద్య అంగన్వాడీల్లోనే సాధ్యమని పేర్కొన్నారు. ఇంకా అంగన్వాడీ కేంద్రాల్లో లభించే ఇతర సౌకర్యాలు, పౌష్టిక ఆహారం, ఇతర సేవల గురించి పీడీ వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ జయంతి, సూపర్ వైజర్లు కొండసాని రజిత, భారతి, లక్ష్మీ, మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు హాజరయ్యారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )